Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 25.05.2018, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 51 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com


## ఆగిన.. నవలా నాడి



## కనుమూసిన.. యద్దనపూడి

అక్షర పుష్పాలను మమతల మల్లెల మాలలుగా కట్టి.. వాటికి ఇంపైన పరిమళాలను అద్ది... తెలుగు నవలా లోకంలో రారాణిగా వెన్నెల వెలుగుల సంతకం చేసి.. తెలుగునాట తిరుగులేని రచయిత్రిగా ప్రఖ్యాతిగాంచిన నవలా రాణి యద్దనపూడి సులోచనరాణి తిరిగి రాని లోకాలకు తరలిపోయింది. తెలుగు వారి గుండె చెదిరింది. నవలా నాడి ఆగిపోయింది. (మిగతా 11వ పేజీలో)

# దేవుడితో దాగుడుమూతలు!




**తి**రుమల తిరుపతి దేవస్థానం... ప్రపంచంలోనే అతిపెద్ద పుణ్యక్షేత్రం. హిందువులకు ప్రధాన ఆధ్యాత్మిక కేంద్రం. ఆధ్యాత్మికతలోనే కాదు, ఆలయ ఆదాయంలోనూ అగ్రస్థానంలో వున్న శ్రీవారి నిలయం. ప్రతిరోజూ లక్షలాది మంది భక్తులు వస్తుంటారు. శ్రీవారిని దర్శించుకుంటుంటారు. తిరుమలపైనే వేలాదిమంది ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటూ బ్రతుకుతున్నారు. తిరుమల భక్తి క్షేత్రమే కాదు, ఎంతోమందికి ఉపాధి మార్గం కూడా! క్రైస్తవులకు వాటికన్ సిటి మాదిరిగానే హిందువులకు తిరుమల ప్రత్యేక కేంద్రం. కాకపోతే వాటికన్ సిటీకి వున్నట్లు తిరుమలకు స్వయం ప్రతిపత్తి లేదంతే!

తిరుమల అంటే భక్తే కాదు ప్రధానమైన సెంటిమెంట్ కూడా! తిరుమలలో వివాదాలు చేసినోళ్ళు, తిరుమలను ఆదాయ వనరుగా చూసినోళ్ళు, ఇక్కడ పిచ్చివేషాలేసినోళ్ళు బాగు పడినట్లు చరిత్రలో లేదు. భక్తుల మనోభావాలతోనూ, భగవంతుడితోనూ ఆడుకోవాలని చూసినోళ్ళు అష్టకష్టాల పాలయ్యారు. తిరుమల సెంటిమెంట్ ఎంతటిదంటే దేశవ్యాప్తంగా హిందూ దేవాలయాలను ధ్వంసం చేసిన మొఘలులు గాని, ఆ తర్వాత హిందూ సంస్కృతిపై దాడిచేసిన బ్రిటీషర్లు గాని తిరుమల జోలికి రాలేదు.

కాని, ఇప్పుడు మనవాళ్లే తిరుమల సెంటిమెంట్లతో ఆడుకుంటున్నారు. తిరుమల కేంద్రంగా ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను చూస్తూనేవున్నాం. (మిగతా 11వ పేజీలో)


### బీజేపీయే లక్ష్యంగా.. 'కర్ణాటకం' వేదికగా...

# ఫ్రంట్... మరో స్టంట్!

### ఏకమైన పార్టీలు

**శ**త్రువుకు శత్రువు మిత్రుడు. ఈ సూత్రం ప్రాతిపదిక మీదే భారత రాజకీయాలు నడుస్తుంటాయి. కత్తులు దూసుకున్న పార్టీలు ఒకటవుతుంటాయి. కౌగిలించుకొన్న పార్టీలు విడిపోతుంటాయి. శత్రువుకు శత్రువు మిత్రుడు అన్న సిద్ధాంతం ప్రాతిపదిక మీదే దేశ రాజకీయాలలో మరో ఫ్రంట్ పురుడు పోసుకోబోతోంది. బెంగుళూరులో జరిగిన కుమారస్వామి ప్రమాణస్వీకారోత్సవమే దీనికి అంకురార్పణగా మారింది. (మిగతా 11వ పేజీలో)






# ఈ రోడ్డు భలే డేంజర్ గురూ...



• తరచూ ప్రమాదాలు

నెల్లూరు–ఆత్మకూరు మధ్య రోడ్డు... ఒకప్పుడు తారురోడ్డు. ముంబై రహదారిగా పేరు. కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలతో పాటు కర్నాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలకు వెళ్ళే వాహనాలకు ప్రధాన మార్గం. గతంలో కృష్ణపట్నంపోర్టు నుండి ముడి ఇనుపఖనిజం ఎగుమతి జరుగుతున్న రోజుల్లో ప్రతిరోజూ కొన్ని వందల లారీలు ఈ రోడ్డు మీద తిరుగుతుండేవి. ఈ లారీల క్రింద పడే ఒక్క నెల్లూరు జిల్లాలోనే వందమందికి పైగా మరణించారు. ఈ లారీల దెబ్బకు అప్పట్లో రోడ్డు కూడా బాగా పాడైపోయింది. దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా వున్నప్పుడు కృష్ణపట్నం నుండి పొద్దుటూరు దాకా ముంబై రహదారిని నాలుగులైన్లుగా విస్తరించాలని నిర్ణయించారు. అయితే ఆయన హఠాన్మరణంతో ఈ ప్రతిపాదన మరుగునపడిపోయింది.

తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక నెల్లూరు నుండి ఆత్మకూరు సమీపం వరకు సిమెంట్ రోడ్డును వేసారు. దాదాపు 300కోట్ల వ్యయంతో ఈ రోడ్డు వేయడం జరిగింది. సిమెంట్ ఫ్యాక్టరీలకు ఆదాయం సమకూర్చడానికి తప్పితే ఇలాంటి సిమెంట్ రోడ్ల వల్ల ఎలాంటి ఉపయోగం లేదు. వేసిన సిమెంట్‌రోడ్డు నాలుగులైన్లు కాదు, గతంలో వున్న డబుల్ రోడ్డును ఇంకొంచెం పెంచారంతే. వాహనాలు ఎదురెదురుగా పోవాల్సిందే! ప్రమాదాలు షరా మామూలే! ముఖ్యంగా సిమెంట్‌రోడ్డు మీద వాహనాలలో వెళుతుంటే బండి వూగడంతో పాటు ఒకటే శబ్దం. దీనికితోడు ఈ రోడ్డుపై బండికి పట్టుండదు. ఏదన్నా అడ్డమొచ్చి సడెన్ బ్రేక్ కొడితే బండి తిరగబడే పరిస్థితి. ఈమధ్య కొన్ని వాహనాలు అలాగే తిరగబడ్డాయి. ఈ సిమెంట్‌రోడ్డు వేయడానికి పెట్టిన ఖర్చుతో శుభ్రంగా నాలుగులైన్ల తారురోడ్డు వచ్చుండేది. భూసేకరణ కూడా జరిపి వుండొచ్చు. తారురోడ్డు మీద వున్న ప్రయాణ సుఖం సిమెంట్ రోడ్డు మీద లేకుండాపోయింది.

## ఆనం ఆగ్రహం వెనుక..

# మర్మమేమిటో...?

### ఉరుమురిమి మంగళం మీద పడ్డట్లు సోమిరెడ్డి మీద ఎందుకు పడినట్లు?




***మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి... నెల్లూరుజిల్లా పొలిటికల్ ఎపిసోడ్‌లో ఇప్పుడు మార్మోగుతున్న పేరు. ఈ మధ్యంతా ఆయన తెలుగుదేశాన్ని వీడి వైసిపిలో చేరనున్నాడనే దానిపై టాపిక్ నడిచింది. పార్టీలో బలమైన నాయకుడు, ఒక నియోజకవర్గానికి గట్టి అభ్యర్థి. కాబట్టి చంద్రబాబు ఆయనను అంత తొందరగా దూరం చేసుకోలేదు. ఏదో నచ్చచెప్పి టీడీపీ లోనే ఉండేలా చేసాడు. అదీగాక వైసిపి నుండి ఆయనకు క్లారిటీ రాలేదు. దాంతోనే ముందుకు వెళ్ళలేక టీడీపీలోనే నిలబడ్డాడు.***

కాని, మొన్న ఆత్మకూరులో నిర్వహించిన మినీమహానాడులోను, ఆ తర్వాత నెల్లూరు రూరల్ మినీ మహానాడులోనూ మంత్రి నారాయణ సమక్షంలో మరో మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని ఆయన చేసిన విమర్శలు ఇప్పుడు పార్టీలోనే కలకలం రేపుతున్నాయి. సోమిరెడ్డిపైనే నేరుగా విమర్శనాస్త్రాలు సంధించాడు. రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదంటూ మంత్రిపై కారాలు మిరియాలు నూరాడు. తాను ఛార్జింగ్ లేని ఇన్‌ఛార్జినంటూ, తనకు ఎటువంటి పవర్ లేదంటూ ఆ సభలలోనే వాపోయాడు.

తెలుగుదేశం పార్టీలో తెలుగుదేశం ప్రభుత్వంలో ఇప్పుడు ఎలాంటి వాతావరణం నెలకొందనే విషయం ఎంతో అనుభవజ్ఞుడైన ఆనం రామనారాయణ రెడ్డికి తెలియంది కాదు. ఇది వై.యస్. రాజశేఖరరెడ్డి కేబినెట్ కాదు, మంత్రులు పూర్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో పని చేయడానికి! చంద్రబాబు కేబినెట్! పేరుకే వాళ్ళు మంత్రులు, నడిపించేదంతా చంద్రబాబు, ఆయన కొడుకు చిన్నబాబు. సోమిరెడ్డికి అన్ని నియోజకవర్గాల నేతలతో సంబంధాలున్నప్పటికీ, గత నాలుగేళ్ళుగా ఆయన తన నియోజకవర్గానికే పరిమితం అవుతున్నాడు. మంత్రయ్యాక కూడా ఎవరన్నా పిలిస్తేనే వారి నియోజకవర్గంలోకి వెళుతున్నాడు.

ఆనం రామనారాయణరెడ్డి స్థాయికి ఆయన ఒక జిల్లా మంత్రిపై విమర్శలు చేయాల్సిన పనిలేదు. అదికూడా బహిరంగ వేదిక మీద. ఆయన కావాలనుకుంటే నేరుగా చంద్రబాబుతోనే సమావేశం కావచ్చు. జిల్లాలో పార్టీ పరిస్థితిని వివరించవచ్చు. మంత్రుల పనితీరు బాగా లేదని కూడా చెప్పొచ్చు. సీఎం ద్వారా మంత్రులకు వార్నింగ్ ఇప్పించవచ్చు. రామనారాయణరెడ్డి తనకు డైరెక్ట్‌గా వున్న లైన్‌ను వదిలేసి ఇలా పార్టీ వేదికల మీద మంత్రిపైనే విరుచుకుపడ్డాడంటే అది పార్టీపైన ఉన్న ప్రేమ... లేక కోపమా అని టీడీపీ నాయకులే ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్ళ క్రితం పార్టీలో చేరిన ఆనం రామనారాయణరెడ్డే తనకు అన్యాయం జరిగిందని ఇంతలా వాపోతుంటే చంద్రబాబుకంటే ముందు నుండి పార్టీలో వుండి పార్టీ జెండాలు మోసి భుజాలు కాయలు కాసినోళ్ళు, జెండాలు పట్టి పట్టి చేతులు బొబ్బలెక్కినోళ్ళు, జిందాబాద్‌లు కొట్టి కొట్టి గొంతులు వాచిపోయినోళ్ళు, పార్టీ కోసం కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి అప్పులపాలైన నాయకులు ఇంకెంత బాధపడాలని ఆ పార్టీ నాయకులే అంటున్నారు.

మొత్తానికి జిల్లా తెలుగుదేశం పార్టీలో మంత్రి సోమిరెడ్డే లక్ష్యంగా ఆనం రామనారాయణరెడ్డి చేస్తున్న ఆరోపణలు, విమర్శలు హాట్ టాపిక్‌గా మారాయి.



## మాటల ఘనాపాటి "వాకాటి"...

# ఇప్పుడెక్కడ..?



***రాష్ట్రపతితో బ్రేక్‌ఫాస్ట్, ఉపరాష్ట్రపతితో లంచ్, ప్రధానమంత్రితో టీ, రాష్ట్ర ముఖ్యమంత్రితో డిన్నర్. ఒకేరోజులో ఇవన్నీ మాటల్లో సాధ్యం చేయగల మేధావి, మాటల మాంత్రికుడు, జిల్లా రాజకీయ చిత్రపటంలో ఓ విచిత్రమైన నాయకుడు వాకాటి నారాయణరెడ్డి. జిల్లా కో-ఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షుడిగా ఓ పర్యాయం పనిచేసి ఆ తరువాత యంయల్‌సిగా కాంగ్రెస్‌పార్టీ నుండి ఎంపికై గోడదూకి తెలుగుదేశం నుండి రెండవసారి బరిలో దిగి గెలిచిన వ్యక్తి ఆయన. ఇంతవరకూ బాగానే వుంది, మరి ఇప్పుడు ఆయనెక్కడున్నాడు...?***

సూళ్ళూరుపేట నియోజకవర్గంలో కీలకపాత్ర పోషిస్తూ బలమైన నాయకుడిగా ఎదగాలనే తాపత్రయంతో ఎప్పుడూ వార్తల్లో వుంటూ, సాధ్యమైనంత వరకూ ఎవరో ఒకరితో విభేదిస్తూ తనదైన శైలిలో రాణిస్తుండిన వాకాటి నారాయణరెడ్డి వృత్తి కాంట్రాక్టులైతే ప్రవృత్తి రాజకీయాలు. నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, వై.యస్.రాజశేఖరరెడ్డి వంటి నాయకులతో నేరుగా సంబంధాలు కలిగివుండేవాడు. కాంగ్రెస్‌లో వున్నప్పుడు ఇప్పుడే సోనియాగాంధీతో లంచ్ చేసి వచ్చాననో, వై.యస్.తో ఫ్లైట్‌లో ప్రక్కసీటులో కూర్చుని ప్రయాణం చేసివచ్చాననో చెప్పడంతో కాలం గడిపేవాడు. రాజకీయ నేతగా, కాంట్రాక్టర్‌గా కాంగ్రెస్‌లో ఉన్నంతకాలం ఆయన హవా బాగానే నడిచింది. గల్లీ నుండి ఢిల్లీ స్థాయిలో ఏర్పడిన మంచి సంబంధాలు, వ్యాపార వ్యవహార లావాదేవీలు చురుకుగా కొనసాగాయి. ఢిల్లీలో ఓ గెస్ట్‌హౌస్, అద్దెకు ప్రత్యేక విమానం, హెలికాప్టర్‌లు ఇలా ఆయన స్టైల్‌కి తగ్గట్లుగా అన్నీ ఘనంగానే వుండేవి. వీటితో పాటు బ్యాంకు అప్పులు కూడా అంతే స్థాయిలో పెరిగాయి. డాంబికానికి పోయి బ్యాంకుల్లో చేసిన అప్పుల్తో వ్యాపారాలకు బదులుగా వ్యవహారాలు చేయడంతో ఆ అప్పులు కాస్తా మెడకు చుట్టుకున్నాయి. విషయం సిబిఐ దాకా పాకి వాకాటి కోరుకునే విధంగానే ఆయన పేరు జాతీయ స్థాయిలో వినిపించింది.

దాదాపు నాలుగు నెలల క్రితం ఆయనను అరెస్టు చేసిన సిబిఐ ఆయనను ఎక్కడ విచారిస్తుందో కూడా ఎవ్వరికీ తెలియడం లేదు. తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆయనతో స్నేహబాంధవ్యాలు నడిపిన నేతలు ఎవ్వరూ ఆయన గురించే పట్టించుకోవడం లేదు. అసలు వాకాటి నారాయణరెడ్డి అనే ఓ నాయకుడుండేవాడన్న సంగతి కూడా అందరూ మర్చిపోయారు. వీళ్ళెవ్వరైనా ఓసారి ఆయన గురించి ఆలోచించి కనీసం ఆయన ఎక్కడున్నాడో ఎవరెవరితో బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్‌లు చేస్తున్నాడో జిల్లా ప్రజలకు తెలిపితే బాగుంటుందేమో...! అందుకే పెద్దలు ఎప్పుడూ చెప్తుంటారు మనం ఎంత సంపాదిస్తే అంత వొదగాలనీ... నలుగురితో మంచిగా మెలగాలని.

## నిస్వార్ధ సేవకుడు... నాటి తరం నాయకుడు

# ఓబులరెడ్డికి నాయకుల నివాళి



ఇటీవల మరణించిన కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు, ప్రస్తుతం వై.యస్.ఆర్ కాంగ్రెస్‌పార్టీ అభిమాని గణపం ఓబులరెడ్డి ఉత్తరక్రియలు గత గురువారం మే 17వ తేదీ వింజమూరులోని ఆయన స్వగృహం నందు జరిగాయి. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు ఓబులరెడ్డి అభిమానులు, అనుయాయులతో పాటు ఎం.పి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, శాసనసభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మాజీశాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, మంత్రి నారాయణ ఓయస్‌డి పెంచలరెడ్డి, కావలి వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీఛైర్మెన్ యం.వి. రామిరెడ్డి, మాజీ జిల్లా పరిషత్ ఛైర్మెన్ చెంచలబాబుయాదవ్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జడ్పీటీసీలు, అధికార అనధికార ప్రముఖులు పాల్గొని ఓబులరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఓబులరెడ్డి అన్న కొడుకు, వింజమూరు సర్పంచ్ గణపం బాలకృష్ణారెడ్డిని, అల్లుడు, 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డిని వారు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గణపం ఓబులరెడ్డి కుటుంబ ఆత్మీయులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. గణపం ఓబులరెడ్డి లాంటి నిస్వార్ధ సేవకుడిని నాటి తరం నాయకుడిని కోల్పోవడం బాధాకరమని పలువురు నాయకులు తమ నివాళులర్పించారు.

# మాగుంట లే అవుట్‌కు మహర్దశ!



మాగుంట లే అవుట్‌లో 60అడుగుల తారురోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు మాగుంట లే అవుట్‌లో రైల్వేట్రాక్ పక్కనున్న 60అడుగుల రోడ్డు నిర్మాణానికి, అలాగే మాగుంట లే అవుట్ మాగుంట సుబ్బరామరెడ్డి పార్కు అభివృద్ధికి మున్సిపల్ మంత్రి పి.నారాయణ ఈ నెల 18వతేదీన శంకుస్థాపనలు చేసారు. 60అడుగుల మెటల్‌రోడ్డును కోటి 98లక్షల వ్యయంతో తారురోడ్డుగా నిర్మించనున్నారు. ఈ రోడ్డు పూర్తయితే ఈ ప్రాంతం ఎంతో అందంగా మారడమేకాక మాగుంట లే అవుట్, రవీంద్రనగర్, కొండాయపాలెం గేటు ప్రాంతాలవైపు వెళ్ళేవారికి ఎంతో సౌకర్యవంతంగా వుంటుంది. మాగుంట లే అవుట్ రెసిడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాగుంట సుబ్బరామరెడ్డి స్మారక పార్కును ఇప్పటికే కొంత అభివృద్ధి చేసుకున్నారు. మున్సిపల్ మంత్రి మంజూరు చేయించిన 50లక్షల నిధులతో ఈ పార్కు మరింత సుందరంగా తయారుకానుంది.

ఇక్కడ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అనంతరం మంత్రి నారాయణ తన ప్రసంగంలో మాగుంట లే అవుట్ అభివృద్ధికి మరిన్ని హామీలిచ్చారు. ఇక్కడి అసోసియేషన్ సభ్యుల అభ్యర్ధన మేరకు ఇప్పటికే మాగుంట లే అవుట్ అభివృద్ధికి అడిగినవన్నీ చేస్తున్నానని, ఈ ప్రాంతవాసి 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి ప్రోద్భలంతో మాగుంట లే అవుట్ మెయిన్ రోడ్డును కూడా విస్తరించి ఫుట్‌పాత్‌లు నిర్మించనున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో పార్కులను అభివృద్ధి చేసి డ్రైన్లు, రోడ్ల పనులు పూర్తిచేయడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమానికి నెల్లూరు రూరల్ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మేయర్ అబ్దుల్ అజీజ్, కార్పొరేటర్లు నూనె మల్లిఖార్జున యాదవ్, దాసరి రాజేష్, మేకల రజని, టీడీపీ నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి, హరిబాబుయాదవ్, కోడూరు కమలాకర్‌రెడ్డి, స్థానికులు బట్రెడ్డి కృష్ణారెడ్డి, వట్టిగుంట చంద్రయ్యచౌదరి, సన్నపరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, మువ్వా బలరామయ్య నాయుడు, కనుమూరు శ్రీనివాసులురెడ్డి, దండమూడి హేమంత్ కుమార్, గోళ్ళమూడి శ్రీధర్‌రెడ్డి, ముడి శోభన్‌రెడ్డి, వూరు బిండి ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసులునాయుడు, వింజం సురేష్, ఆళ్ళ సతీష్‌రెడ్డి, బి.వి. కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## స్వామిదాస్ అంటే...

# క్రమశిక్షణ, ఉత్తమ బోధన

**S**tandard
**W**ell Behaved
**A**cademic Excellence
**M**eritorious
**I**deal
**D**isciplined
**O**bedient
**S**peak fluent English
**S**imple, Smart & Supportive

దాదాపు 5 దశాబ్దాల క్రితం జిల్లా మొత్తంలో సంచలనాత్మకంగా నెల్లూరు నగరంలో ప్రారంభించబడిన విద్యాసంస్థ స్వామిదాస్ ఇంగ్లీష్ మీడియం స్కూలు. చిత్తశుద్ధి, అంకితభావం, క్రమశిక్షణ కలిగిన నిఖార్సైన విద్యాధికారిగా(డి.ఇ.ఓ) పనిచేసి తన పదవీ విరమణ అనంతరం తన పేరుతోనే విద్యాసంస్థను ప్రారంభించిన ఘనత స్వామిదాస్ సార్‌ది. నలభై ఎనిమిదేళ్ళ సుదీర్ఘ ప్రస్థానంలో కొన్ని వందలమంది ఇంజనీర్లను, డాక్టర్లను, ఐఏఎస్, ఐపిఎస్ అధికారులతో పాటు వ్యాపారవేత్తలను ప్రభుత్వోద్యోగులను సమాజానికి అందించిన చరిత్ర జిల్లాలో ఒక్క స్వామిదాస్ స్కూలుకే వుందంటే అతిశయోక్తి కాదు.

1970వ దశకంలోనే స్కూల్ ప్రాంగణంలో ఖచ్చితంగా ఆంగ్లమే మాట్లాడాలి, గోళ్ళు పెంచుకోకూడదు, క్రాఫు పెరగకూడదు, తలకి నూనె లేకుండా స్కూలుకి రాకూడదు, ఒక్క నిముషం ఆలస్యంగా వచ్చినా గేటు బయటే వుండాలి, హోమ్‌వర్క్ చేయకపోతే ఇంపోజిషన్ వ్రాయించడం వంటి కఠినతరమైన విధానాలతో ఖచ్చితమైన క్రమశిక్షణతో విద్యార్థినీవిద్యార్థులను తీర్చిదిద్దడంలో నంబర్ 1 సంస్థగా స్వామిదాస్ స్కూలు పేరు గడించింది. స్వామిదాస్ గారి సతీమణి లిల్లీ స్వామిదాస్ సారధ్యంలో అత్యున్నత ప్రమాణాలు కలిగిన బోధనా సిబ్బందిని ఎంపిక చేసి స్టూడెంట్స్‌కి తర్ఫీదు ఇచ్చేవారు.


ఏళ్ళు గడిచాయి, తరాలు మారాయి, రోజులూ మారాయి, మారుతున్న కాలంతో పాటు పరిస్థితులూ మారాయి. పుట్టగొడుగుల్లా గొందికో స్కూలు అవతరించింది. అయినా స్వామిదాస్ స్కూలుకి వున్న ప్రత్యేకత ఇప్పటికీ కొనసాగుతోంది. అమ్మానాన్నలు వేసిన బలమైన పునాదులపై వారి కుమార్తెలు ఈ స్కూల్‌ని ఓ కుటుంబసంస్థలా నడుపుతున్నారు. మన ఇల్లు బాగుంటే మన ఊరు బాగుంటుంది, మన ఊరు బాగుంటే మన రాష్ట్రం బాగుంటుంది, మన రాష్ట్రం బాగుంటే మన దేశమే బాగుంటుంది... ఇదీ వారి ఆలోచన.

స్వామిదాస్ స్కూల్ అంటే... లాభాపేక్ష లేకుండా నిస్వార్ధంతో రేపటిపౌరులను తీర్చిదిద్ది సమాజానికి అందించాలన్నది వారి లక్ష్యం. ఇప్పుడు ప్రతి పాఠశాలలో చేస్తున్న స్కూల్‌డే సంబరాలకి శ్రీకారం చుట్టింది స్వామిదాసే. ఆరోజుల్లోనే నెల్లూరు టౌన్‌హాల్‌లో క్రిక్కిరిసిన జనంతో స్కూల్ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించేవారు. నేడు నెల్లూరుజిల్లాలో నడిచే ఎన్నో స్కూళ్ళకు రోల్‌మోడల్ స్వామిదాస్, ఆదర్శం స్వామిదాస్, స్ఫూర్తిప్రదాత స్వామిదాస్.

ఉత్తమ శిక్షణతో, నిజమైన క్రమశిక్షణతో ఎప్పటికప్పుడు తమ సంస్థను ఆధునీకరించుకుంటూ ఏ యేడాదికాయేడాది తమ రికార్డులను తామే బద్దలు కొట్టుకుంటూ నెల్లూరు విద్యా రంగంలో వికసిస్తున్న విద్యాకుసుమం స్వామిదాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్.

జీవితంలో ఎదురయ్యే ఎలాంటి సమస్యలనైనా ధైర్యంగా ఎదుర్కొనే తత్వాన్ని ఎదుర్కోగలిగే మానసిక ధృఢత్వాన్ని ప్రతిబింబించేలా "రెడ్ & వైట్ రెడీ టు ఫైట్" అన్నట్లు రెడ్ & వైట్ యూనిఫాంతో అరుదైన గుర్తింపును తెచ్చుకుని 48సంవత్సరాలుగా ఆదరింపబడుతున్న స్వామిదాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఈ ఏడాది కూడా పదవ తరగతి పరీక్షలలో ఘనమైన ఫలితాలను సాధించి తన సత్తా చాటుకుంది. కేవలం చదువే కాకుండా, క్రీడలు, సమాజసేవ, ఆధ్యాత్మికత వంటి అన్ని విభాగాలలో తమ చిన్నారులను పరిపూర్ణంగా తీర్చిదిద్దుతున్న సంస్థ స్వామిదాస్.



## 'ప్రభా'తం

రాజకీయాలలో ఉంటే రాజులా వుండాలి. లేదంటే రాజు అన్యాయాలను, అక్రమ పరిపాలనను ఎదురించే పోరాట యోధుడిలా వుండాలి. అంటే ప్రతిపక్షం అన్నమాట. ఈ రెండుపాత్రలు తప్పితే భారత రాజకీయాలలో ఇంకే పాత్రయినా నిరర్ధకమే!

గత కొన్ని రోజులుగా జాతీయ స్థాయిలో రాజకీయ చర్చకు కారణమైన కర్నాటక సంక్షోభానికి ఎట్టకేలకు తెరపడింది. కాంగ్రెస్ మద్దతుతో కుమారస్వామి ప్రభుత్వం ఏర్పడి ప్రమాణస్వీకారం తంతును కూడా పూర్తి చేసింది. ఇరు పార్టీల మధ్య మంత్రి పదవుల పంపిణీ కూడా సజావుగానే జరిగింది. కర్నాటక రాజకీయాలలో కింగ్‌మేకర్ అవుతాడనుకున్న జెడి(ఎస్) అధినేత కుమారస్వామి ఏకంగా కింగే అయ్యాడు. ఎట్టిపరిస్థితుల్లోనూ కర్నాటక పీఠం బీజేపీకి దక్కకూడదన్న సోనియాగాంధీ లక్ష్యమే కుమారస్వామికి లక్షణంగా సీఏం కుర్చీని అప్పగించింది.

మొదట గవర్నర్ పిలుపు ప్రకారమే బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఎన్నికైన యడ్యూరప్ప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసారు. ఆయనకు బల నిరూపణకు గవర్నర్ 15రోజులు గడువు ఇచ్చినా, సుప్రీం కోర్టు రూపంలో యడ్యూరప్పకు అపశకునం ఎదురైంది. కాంగ్రెస్ వేసిన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు యడ్యూరప్ప బలనిరూపణకు ఒకరోజే గడువు ఇవ్వడంతో కథ అడ్డం తిరిగింది. విపక్షాల ఎమ్మెల్యేలను క్యాంపులు పెట్టి మరీ కట్టడి చేయడంతో తగినంత సంఖ్యా బలం లేక బలనిరూపణకు ముందే యడ్యూరప్ప రాజీనామా చేయాల్సివచ్చింది. ఆయన రాజీనామా చేయగానే కాంగ్రెస్‌తో పాటు ఆయా ప్రాంతీయపార్టీల నేతలు ప్రజాస్వామ్యం బ్రతికి బట్ట కట్టిందని, రాజ్యాంగ విలువలను సుప్రీంకోర్టు కాపాడిందంటూ ఎవరికి తోచిన రీతిలో వాళ్ళు స్టేట్ మెంట్లిచ్చారు. ఇలా ప్రజాస్వామ్య విలువలు గురించి ప్రవచనాలు చెప్పిన వారిలో తన రాష్ట్రంలో విపక్షానికి చెందిన ముగ్గురు ఎంపీలను, 23మంది ఎమ్మెల్యేలను రిటైల్ మార్కెట్‌లో కొనుగోలు చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా వుండడం గమనార్హం.

కర్నాటకలో ఇంతవరకు ముగిసింది ఒక ఎపిసోడ్ మాత్రమే! ఈ మొత్తం ఎపిసోడ్‌లో కాంగ్రెస్ నిర్వహించిన పాత్రే తనంతట తానుగా ఆత్మహత్యకు బాటలు వేసుకున్నట్లుగా వుంది. బీజేపీని నిలువరించడం కోసం జెడి(ఎస్)కు కాంగ్రెస్ మద్దతు పలికింది. అంటే కర్నాటకలో అధికారపక్షం కాకపోగా కనీసం ప్రతిపక్ష పార్టీ పాత్రను కూడా తనంతట తాను వదులుకుంది. కుమారస్వామి మంత్రి వర్గంలో కాంగ్రెస్‌కు విదిల్చింది ముష్టి మంత్రిపదవులే! అసలు అధికారం ముఖ్యమంత్రిదే! కాబట్టి కర్నాటకలో వుండేది జెడి(ఎస్) ప్రభుత్వమే అవుతుంది.

యడ్యూరప్ప రాజీనామా చేయగానే కర్నాటకలో ప్రజాస్వామ్యం తిరిగి ప్రాణం పోసుకుందంటున్నారు. ఏ విధంగా ప్రాణం పోసుకున్నట్లు? కర్నాటక ప్రజలు తిరస్కరించిన వ్యక్తిని ముఖ్యమంత్రిగా చేసి, తిరస్కరించిన పార్టీకి అధికారం అప్పగించింది కాంగ్రెస్. ఇదేనా ప్రజాస్వామ్యం ప్రాణం పోసుకోవడం. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్, జెడి(ఎస్)ల మధ్య పొత్తులేదు. ఎవరికి వాళ్ళే విడివిడిగా పోటీ చేసారు. ఎన్నికల ప్రచారంలోనూ ఒకరిపై ఒకరు ఘాటుగానే విమర్శలు చేసుకున్నారు. ఇరు పార్టీలు కూడా అన్ని స్థానాలలో పోటీచేసాయి. ఎన్నికల ఫలితాలు చూస్తే బీజేపీకి 104సీట్లొచ్చి పెద్దపార్టీగా అవతరించింది. కాంగ్రెస్ 78సీట్లతో రెండోస్థానంలో నిలిచింది. ఇక అన్నిచోట్ల పోటీ చేసిన జెడి(ఎస్) 38స్థానాలలో మాత్రమే నెగ్గింది. అది కూడా ఆ పార్టీకి వచ్చిన సీట్లన్నీ దాదాపు ఒక ప్రాంతంలోనివే! సీట్ల పరంగా చూస్తే ప్రజలు బీజేపీని ఆదరించారు. ఓట్ల పరంగా చూస్తే బీజేపీ కంటే కాంగ్రెస్‌కు అదనంగా రెండు శాతం ఓట్లొచ్చాయి. అంటే అన్ని ప్రాంతాలలో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పూర్తిగా వ్యతిరేకించ లేదు. కర్నాటక ప్రజల తీర్పు బీజేపీ లేదా కాంగ్రెస్‌లకు అనుకూలంగా వుండింది. జెడి(ఎస్) దాదాపు 150సీట్లల్లో మూడోస్థానంలో వుండడమో, డిపాజిట్లు కోల్పోవడమో జరిగింది. జెడి(ఎస్)ను కర్నాటక ప్రజలు అధికారంలో వుండాలని కోరుకోలేదు. కుమారస్వామిని ముఖ్యమంత్రిగా కోరుకోలేదు. ప్రజలు కోరుకోని దానిని కాంగ్రెస్ ప్రజల మీద రుద్దింది. కర్నాటకలో కాంగ్రెస్ తొందరపడి జెడి(ఎస్)కు మద్దతు తెలిపివుండ బల్లేదు. తమకు మద్దతునివ్వమని అడిగి వుండొచ్చు. కుమారస్వామికి డిప్యూటీ సీఏంను ఆఫర్ చేసి ఉండొచ్చు. ఒకవేళ జెడి(ఎస్) తమతో రాకుండా బీజేపీతో వెళ్ళివుంటే హుందాగా ప్రతిపక్ష పాత్రను స్వీకరించి ఉండొచ్చు. ఇప్పుడు కర్నాటకలో పూర్తిగా అధికారం లేక, అటు ప్రతిపక్షంగా లేక కాంగ్రెస్ పరిస్థితి రెంటికీ చెడిన రేవడి అయ్యింది.

ఒకపక్క కాంగ్రెస్ ఒక్కో రాష్ట్రంలో కనుమరుగవుతూ పోతుంది. ఈరోజు ఆ పార్టీకి ఉండేది రెండే రెండు రాష్ట్రాలు పంజాబ్, మణిపూర్. మరో పక్క బీజేపీ ఒక్కో రాష్ట్రాన్ని ఆక్రమించుకుంటూ పోతోంది. బీజేపీ లక్ష్యం ఒక్కటే! ఏ రాష్ట్రంలోనైనా అధికారాన్ని సాధించడమా లేకుంటే ప్రతిపక్షంగానైనా ఉండడమా? ఈరోజు దేశంలో 20రాష్ట్రాలలో ఆ పార్టీ సొంతంగా లేదా భాగస్వామ్య పార్టీలతో అధికారంలో వుందంటే కారణం కొడితే అధికారం లేదంటే ప్రతిపక్షంగా పోరాటం అనే మార్గాన్ని అనుసరించడమే. కాబట్టే ప్రజలు బీజేపీని విశ్వసిస్తున్నారు. ఒకప్పుడు బీజేపీ జెండా కనపడడమే గగనం అనుకున్న రాష్ట్రాలలోనూ ఈరోజు ఆ పార్టీ అధికారంలో వుందంటే వారు అనుసరించిన మార్గమే దానికి కారణం. కమ్యూనిస్టు కంచుకోటలు పశ్చిమబెంగాల్, కేరళలోనూ ఆ పార్టీ ఎదుగుతుందంటే కారణం... టార్గెట్ అధికారమే కాదు, ప్రతిపక్షంగానైనా వుండాలన్న తపన కూడా! బీజేపీ ఎంచుకున్న మార్గానికి భిన్నంగా కాంగ్రెస్ పయనిస్తోంది. కాబట్టే ఒక్కో రాష్ట్రంలో తుడిచి పెట్టుకుపోతోంది. కర్నాటకను కూడా వాళ్ళు ఇలాగే చేసుకున్నట్లయ్యింది.

### కాంగ్రెస్‌ది తప్పటడుగేనా?



కర్నాటకలో కాంగ్రెస్ తొందరపడి జెడి(ఎస్)కు మద్దతు తెలిపివుండ బల్లేదు. తమకు మద్దతునివ్వమని అడిగి వుండొచ్చు. కుమారస్వామికి డిప్యూటీ సీఏంను ఆఫర్ చేసి ఉండొచ్చు. ఒకవేళ జెడి(ఎస్) తమతో రాకుండా బీజేపీతో వెళ్ళివుంటే హుందాగా ప్రతిపక్ష పాత్రను స్వీకరించి ఉండొచ్చు. ఇప్పుడు కర్నాటకలో పూర్తిగా అధికారం లేక, అటు ప్రతిపక్షంగా లేక కాంగ్రెస్ పరిస్థితి రెంటికి చెడిన రేవడి అయ్యింది.

## అల్లూరు పోలేరమ్మకు పూలంగిసేవ



పూలతో అలంకరించిన ఆలయ ముఖద్వారం

ఆపదలు బాపే చల్లనితల్లిగా, కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా ప్రసిద్ధమైన అల్లూరు పోలేరమ్మ తల్లికి ఈ నెల 20న వైభవంగా పూలంగిసేవ నిర్వహించారు. ఆల్లూరుపేటలోని శ్రీ పోలేరమ్మ అమ్మవారి దేవస్థానంలో స్థానిక ప్రముఖులు మేడా మస్తాన్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తరించారు. ఆలయ ప్రాంగణాన్ని, ముఖద్వారాన్ని పూలమాలలతో శోభాయమానంగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖపట్నంకు చెందిన నవచైతన్య మండలి ఆధ్వర్యంలో జానపద వాయిద్యాలతో నృత్యాలు, సంగీతంతో పాటు, హాస్యవల్లరి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యంను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. పలువురు గ్రామపెద్దలు, స్థానిక ప్రజలు పెద్దసంఖ్యలో ఈ వేడుకలకు తరలివచ్చారు.

## సంగమేశ్వరాలయంలో బయల్పడ్డ నాణేలు

సంగంలో వెలసివున్న కామాక్షి సమేత శ్రీ సంగమేశ్వరాలయంలో సుమారు 200 ఏళ్ళ కాలం నాటి రాగి, వెండి నాణేలు బయల్పడ్డాయి. ఈ ఆలయంలో ధ్వజస్తంభం శిథిలావస్తకు చేరడంతో, నూతన ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించాలనే సంకల్పంతో, ప్రస్తుతం ఉన్న ధ్వజస్తంభాన్ని ఈనెల 20న శాస్త్రోక్తంగా తొలగించగా, దాని కింద పురాతన రాగి, వెండి నాణేలు లభించినట్లు ఆలయ ఇ.ఓ సుధాకర్, ఎస్‌ఐ వేణు తెలియజేశారు.

ఇక్కడ ధ్వజస్తంభం ఏర్పాటుచేసి సుమారు 130 ఏళ్లకు పైగానే అయిందని, ఇది శిథిలావస్తకు చేరుకోవడంతో తొలగించామని, ధ్వజస్తంభం కింద 1880, 1883, 1905 సంవత్సరాల కాలం నాటి నాణేలు బయల్పడ్డాయని తెలిపారు. 1160 రాగినాణేలు, 74 వెండినాణేలతో పాటు ఒక ఉంగరం లభించాయి. వీటిని అధికారుల సమక్షంలో భద్రపరచామని, త్వరలోనే దాతల సహకారంతో నూతన ధ్వజస్తంభ ప్రతిష్టకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆ సమయంలో ఈ నాణేలను కూడా అందులోనే ఉంచుతామన్నారు. ఈ నాణేలను చూస్తుంటే బహుశా సంగమేశ్వరాలయం నిర్మించి సుమారు 200 ఏళ్లకు పైగానే అయివుండవచ్చని భావిస్తున్నామని ఆలయ ధర్మకర్త మాగం గిరిబాబు తెలియజేశారు.



వెండి, రాగి నాణేలను చూపుతున్న ఆలయ నిర్వాహకులు




### పెరుగుతున్న క్యాన్సర్ ముప్పు

దేశంలో క్యాన్సర్ వ్యాధి రోజురోజుకు విజృంభిస్తోంది. ఒకప్పుడు లక్షల్లో ఒకరిద్దరికి కనిపించే ఈ ప్రాణాంతక వ్యాధి ఇప్పుడు వందల్లో ఒకరిద్దరికి లెక్కన వస్తోంది. తొలిదశలోనే క్యాన్సర్ వ్యాధిని పసిగట్టడం కష్టంగా వుంటుంది. ముఖ్యంగా మారిపోయిన ఆహార అలవాట్లు, రసాయనాల వాడకం, కల్తీ ఆహారపదార్థాలు, పెరిగిన ధూమపానం వంటివి క్యాన్సర్‌కు కారణమవుతున్నాయి. క్యాన్సర్ బారిన పడకుండా ప్రజల్లో అవగాహన పెంపొందించాలి. అలాగే క్యాన్సర్ నిర్ధారణ కేంద్రాలను నెలకొల్పి ప్రతిఒక్కరూ ఏడాదికొకసారి పరీక్షలు చేయించుకునే ఏర్పాటు చేయాలి. క్యాన్సర్ మందులపై ఇంకా విస్తృత స్థాయి పరిశోధనలు జరిగి పూర్తిస్థాయి చికిత్సను అందుబాటులోకి తేవాలి!

*శ్రీకంఠ సుబ్రహ్మణ్యం, కావలి.*

### దేవుడితో పెట్టుకున్నారు

తిరుమల తిరుపతి దేవస్థానంలో రాజకీయాలు చేసిన వాళ్లెవరూ బాగుపడిన దాఖలాలు లేవు. చంద్రబాబు హయాంలో తిరుమల పవిత్రతకు కళంకం తెస్తున్నారు. అన్యమత ప్రచార సభలకు వెళ్ళే వారిని టీటీడీ ఛైర్మెన్‌లుగా, సభ్యులుగా నియమించి తప్పు చేశారు. టీటీడీలో వున్న అన్యమత ఉద్యోగస్తులను తొలగించకపోగా వారి ఉద్యోగ భద్రతకు కొత్త పాలక మండలి హామీ ఇచ్చింది. ఇప్పుడు టీటీడీ అర్చకుల విషయంలోనూ రాజకీయాలకు తెరతీసారు. 65ఏళ్లకే పదవీ విరమణను తెరమీదకు తెచ్చి వివాదం సృష్టించారు. చంద్రబాబు ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి కాబట్టే ఇలా చేస్తున్నారు.

*సి.రాజీవి, నెల్లూరు.*

### రాజ్యాంగం గురించి కాంగ్రెస్ చెప్పబల్లేదు

కర్నాటక పరిణామాలపై కాంగ్రెస్ నాయకులు నీతులు మాట్లాడుతున్నారు. మెజార్టీ సీట్లున్న పార్టీని గవర్నర్ ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలి. రాజ్యాంగ నిబంధనలను పాటించాలని అందరూ కోరుకుంటారు. ఈ దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను ఖూనీ చేసిన పార్టీ కాంగ్రెస్.

ఈ దేశానికి తొలి ప్రధానిగా నెహ్రూ ఎన్నికే అనైతికం. ఆరోజు కాంగ్రెస్ సభ్యుల్లో 13మంది ప్రధానిగా పటేల్‌కు ఓటేస్తే, నెహ్రూకు ఒక్కరూ మద్దతు తెలుపలేదు. కాని మెజార్టీ సభ్యులు మద్దతునిచ్చిన పటేల్‌ను కాదని నెహ్రూను ప్రధానిని చేసాడు గాంధీ. ప్రజాస్వామ్యాన్ని ఆరోజే పాతిపెట్టారు. ఈ దేశాన్నేదో తమ కుటుంబ ఆస్తిగా అనుకున్నారు. ఆ తర్వాత కూడా ఎన్నో రాష్ట్రాలలో విపక్ష ప్రభుత్వాలను అన్యాయంగా కూల్చి వేసిన ఘనత కాంగ్రెస్‌ది. వాళ్ళకు ఇంకొకరిని వేలెత్తి చూపే అర్హత లేదు.

*వి.పాంచజన్యం, నెల్లూరు.*



# airtel కాదిది.. ఎయిర్‌హెల్

- వినియోగదారులకు బి.పి తెప్పిస్తున్న సెల్ నెట్‌వర్క్
- క్షణక్షణానికి డిస్కనెక్ట్ అవుతున్న కాల్స్
- ప్రక్కనే ఉన్నా అవుట్ ఆఫ్ కవరేజ్ అంటూ మెసేజ్‌లు

*అప్పారావు ఆఫీసుకు బయల్దేరాడు. అప్పటికే టైం 10 గంటలు. ఆఫీసుకు పోవాలంటే ఇంకా అరగంట పడుతుంది. బాగా లేటయ్యింది. బాస్ ఏమంటాడో ఏమో అనుకుంటూ బైక్‌లో రయ్‌న వస్తున్నాడు. అంతలో ఫోన్... నెంబర్ తన బాస్ నాగేశ్వరావుదే... భయపడుతూనే ఫోన్ ఎత్తాడు. ఏం అప్పారావు ఇంకా తెల్లారలేదా... ఆఫీసుకు రేపొస్తావా... అని ఆయన అరుస్తుండగానే ఫోన్ కట్. అప్పారావు ఫోన్‌లో చూస్తే సిగ్నల్ లేదు. ఫోన్‌ను అటూ ఇటూ తట్టి స్విచ్ఛాఫ్ చేసి మళ్ళీ ఆన్ చేసాడు. అప్పుడు సిగ్నల్ కనిపించింది. ఇంతలో మళ్ళీ బాస్ నుండి ఫోన్... ఎత్తగానే అవతల నుండి... ఏం అప్పా రావు... మాట్లాడుతుంటే ఫోన్ కట్ చేస్తావ్... నేనంటే లెక్క లేదా? ఉద్యోగం అంటే ఇష్టం లేదా... అంతగా ఇష్టం లేని ఉద్యోగం చేయడమెందుకు... అని అరుస్తుండగానే మళ్ళీ ఫోన్ కట్... అప్పారావులో అలివిగాని టెన్షన్... సెల్‌ఫోన్‌ను కనిపెట్టినవాడు ఎదురుగా వుంటే కసకస పొడిచేయాలన్నంత కసి... ఇంతలో మళ్ళీ ఫోన్ మోగింది. బాస్‌దే ఫోన్. భయపడుతూనే ఫోన్ ఎత్తాడు. అవతల నుండి బాస్ నాగేశ్వరరావు ఎంతో కూల్‌గా... అప్పారావు నీ సెల్‌ఫోన్ ఏ నెట్‌వర్క్ అని అడిగాడు. ఎయిర్‌టెల్ సార్ అని అప్పారావు చెప్పాడు. నాదీ అదే నెట్‌వర్క్... నీతో మాట్లాడుతున్నప్పుడు నీ ఫోనే కాదు, నా ఫోన్ కూడా కట్ అవుతుంది... మనం ఆఫీసు టైమింగ్స్‌నే కాదోయ్ ఈ ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌ను కూడా మార్చుకుందాం... ఇది ఎయిర్‌టెల్ కాదు... ఎయిర్ హెల్... అంటూ బాస్ ఫోన్ పెట్టేసాడు.*

ఫోన్ అన్నది మనుషుల సమాచార పంపిణీ కేంద్రం. భావాలను సరఫరా చేసే వేదిక. కాని, ఆ ఫోన్‌లే ఇప్పుడు ప్రజలకు బి.పి, దాంతో పాటు షుగర్ వంటి రోగాలను తెప్పిస్తున్నాయి. సెల్‌ఫోన్‌లో 2జీ, 3జీ, 4జీలు వచ్చాయని సంబరపడాలో లేక ఛండాలంగా తయారైన నెట్‌వర్క్‌ను చూసి బాధపడాలో వినియోగదారులకు అర్ధం కావడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి సెల్‌ఫోన్ నెట్‌వర్క్ ప్రారంభించింది ఎయిర్‌టెల్. రాష్ట్రంలో బిఎస్ఎన్ఎల్ కంటే ఎక్కువ మంది వినియోగదారులను కలిగివున్న సంస్థ. అలాంటి ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ ఇప్పుడు దారుణంగా మారింది. కాల్‌డ్రాప్స్ పెరిగాయి. పది ముక్కల్లో వున్న సమాచారాన్ని అవతల వ్యక్తికి చెప్పాలంటే పదిసార్లు కాల్ చేయాల్సివస్తోంది. కాల్ డ్రాప్స్‌తో సమయం వృధా కావడంతో పాటు బి.పి., టెన్షన్‌లు కూడా పెరుగుతున్నాయి. రోజులో ఎన్నిసార్లు (మిగతా 11వ పేజీలో)




## లోక్‌సభ వద్దు..

# అసెంబ్లీనే ముద్దు

### నెల్లూరు సీటంటే భయపడుతున్న తెలుగుతమ్ముళ్ళు

***నెల్లూరు లోక్‌సభ స్థానానికి అభ్యర్థిని వెదకడం తెలుగుదేశం అధిష్టానానికి పెద్ద పనిగా మారింది. 1985 నుండి ఈ లోక్‌సభ ట్రాక్ రికార్డు చూస్తే ఏ నాయకుడికైనా టీడీపీ అభ్యర్థిగా ఇక్కడ నుండి పోటీ చేయాలంటే భయమే! ఇప్పటివరకు 9సార్లు నెల్లూరు లోక్‌సభకు ఎన్నికలు జరిగితే టీడీపీ అభ్యర్థులు గెలిచింది రెండంటే రెండు సార్లే! ఆ రికార్డును చూసే లోక్‌సభ పోటీకి నాయకులు వెనక్కుతగ్గుతున్నారు.***

2014 ఎన్నికల్లో ఆదాల ప్రభాకర్‌రెడ్డి రూపంలో తెలుగుదేశంకు మంచి అభ్యర్థే దొరికాడు. ఆయన గెలుపు అంచులదాకా వచ్చి ఓడిపోయాడు. అయితే ఈసారి ఎన్నికల్లో మాత్రం ఆయన లోక్‌సభ నుండి పోటీ చేయడానికి విముఖత చూపుతున్నట్లు తెలుస్తోంది. లోక్‌సభ కంటే ఏదో ఒక అసెంబ్లీ నుండి పోటీ చేయడానికే ఆయన ఇష్టపడుతున్నట్లు సమాచారం. ఆదాల అసెంబ్లీ వైపు మొగ్గుచూపితే ఇక లోక్‌సభ అభ్యర్థి ఎవరు? 2012 ఉపఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన బీద మస్తాన్‌రావు కూడా లోక్‌సభ వైపు చూడడం లేదు. ఆయన మనసు రాజ్యసభ వైపు లాగుతోంది. ఇక తప్పదనుకుంటే కావలి అసెంబ్లీ నుండి పోటీచేసే అవకాశముంది. వున్నవారిలో నెల్లూరు లోక్‌సభకు సరైన అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి. కాని ఆయన లోక్‌సభకు వెళతాడా? అసలు టీడీపీలోనే వుంటాడా? అన్నది అనుమానం. ఉండే గట్టినాయకులలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కూడా అసెంబ్లీకే పోవాలనుకుంటాడు గాని లోక్‌సభకు మొగ్గుచూపడు. పార్టీలో వుండే ఇంకో ప్రతిపాదన ఉదయగిరి ఎమ్మెల్యే బొల్లినేని రామారావును ఒంగోలు లోక్‌సభకు పంపించి నెల్లూరు లోక్‌సభలో మాగుంట శ్రీనివాసులురెడ్డిని దించడం. ఇదే జరిగితే నెల్లూరు పార్లమెంటులో ఎప్పుడూ చూడని ఉత్కంఠ సమరాన్ని చూడగలం. మంత్రి పి.నారాయణ వుంటే నెల్లూరు లోక్‌సభకు పోటీ చేయడం పార్టీకి కలిసిరాక పోవచ్చు. నెల్లూరు లోక్‌సభకు అందుబాటులో వున్న వీళ్ళలో ఒకరిని దించడమా... లేక ఇతర జిల్లాలకు చెందిన పారిశ్రామికవేత్తలను దిగుమతి చేయడమా? ఈ రెండు మార్గాలు టీడీపీ అధిష్టానం ముందున్నాయి. వాళ్ళు ఏ మార్గం ఎంచుకుంటారో చూడాలి.

సంస్మరణ

మా అభ్యున్నతికి కారకులు, మాకు స్ఫూర్తిప్రదాతలు
బంధుజనప్రియులు, సమతావాది

**పూండ్ల చెంచురెడ్డి గారు**

పరమపదించి తేది. 27.05.18 నాటికి
ముప్పై సంవత్సరాలు నిండుతాయి.

**ఆ పుణ్యమూర్తిని సంస్మరించుకొంటూ...**

భార్య :
**పూండ్ల కామేశ్వరమ్మ**

కుమారులు :
**డా॥ పూండ్ల శ్రీనివాసులురెడ్డి**
**పూండ్ల వెంకురెడ్డి**

మరియు
**కుటుంబసభ్యులు**

# నెల్లూరు కబుర్లు

## ప్రమాదకరంగా రాళ్ళు

• పగులుతున్న ఒళ్ళు

భూగర్భ డ్రైనేజీ కోసమని నెల్లూరు నగరంలో రోడ్లను తవ్వేసారు. తవ్విన చోట డస్ట్ పోసారు. దుమ్ము, ధూళితో జనం చస్తున్నారు. ఇంతేనా ఇప్పుడు తారు రోడ్లు వేయడానికని కంకరరాళ్ళు పరిచారు. మినీబైపాస్‌తో పాటు పలు రోడ్లలో కంకరరాళ్ళు పరచడం జరిగింది. అయితే లారీలు, బస్సులు, ఆటోలు వెళ్తున్న సమయంలో చక్రం క్రింద పడి లేస్తున్న ఈ రాళ్ళు విసురుగా దారినపోయే వాళ్ళకు తగులుతున్నాయి. కాళ్ళకు, ఒంటికి తగిలితే ఫర్వాలేదు. తలకు, కణిత వంటి భాగాలకు తగిలితే ప్రాణాలకే ప్రమాదం. వీలైనంత తొందరగా రాళ్ళు పరచిన వెంటనే రోడ్లు వేయాలని ప్రజల మనవి.

### కాప్‌జెమిని క్యాంపస్ సెలక్షన్స్‌లో

## బిజిఆర్ విద్యార్థులు



కాప్‌జెమిని ఈ నెల 21న నిర్వహించిన కాంపస్ సెలక్షన్స్‌లో బెజవాడ గోపాలరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు కె.శృతి, టి.హార్షిత ఎంపిక య్యారు. కళాశాల సెక్ర టరి, కరస్పాండెంట్ జె.వి.రెడ్డి, ప్రిన్సిపల్ మృదుల విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ కళాశాలలో నిర్వహించే ఇంటరాక్టివ్ ప్రోగ్రామ్స్, పర్సనాలిటి డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్, యోగా తరగతులు తమకు ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. అంకితభావం గల అధ్యాపకుల ప్రోత్సాహం వల్ల తాము ఇవి సాధించగలిగామన్నారు.

## కాపువీధిలో సులభ్ కాంప్లెక్స్



నెల్లూరు కావు వీధిలో గుడ్డల కొట్లు, బంగారు అంగళ్ళు ఎక్కువ. ప్రతిరోజూ నగరంలో నుండే కాక జిల్లాలోని ఇతర ప్రాం తాల నుండి కూడా ఈ సందులోకి వేలాది మంది వస్తుంటారు. ముఖ్యంగా మహిళా ఖాతాదారులెక్కువ. కాని ఒక్క షాపులోనూ బాత్‌రూమ్ సదుపాయాలుండవు. ఏదన్నా అర్జంట్ అయితే మహిళలు చాలా ఇబ్బంది పడాల్సివస్తుంది. ఎట్టకేలకు నగర ఎమ్మెల్యే పి.అనిల్ కుమార్‌యాదవ్ చొరవతో ఇక్కడ ఖాళీగా వున్న కార్పొరేషన్ స్థలంలో సులభ్ కాంప్లెక్స్‌ను కట్టారు. ఈమధ్య ఎమ్మెల్యే అనిల్ దానిని ప్రారంభించి పుణ్యం కట్టుకున్నాడు.

## జూనియర్ ఎన్టీఆర్ జన్మదినోత్సవం

జూనియర్ ఎన్టీఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు నర్తకీసెంటర్‌లో ఈనెల 20న అన్నదానం నిర్వహించారు. స్థానిక తారక్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టిడిపి నగర నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్‌ను కట్ చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. తారక్‌యూత్ సభ్యులు దినకర్, భాస్కర్, ప్రసాద్, శ్రీహరి, శ్రీనివాసులు, మధు తదితరులు పాల్గొన్నారు.

### గీతామయి వృద్ధాశ్రమంలో...

జూనియర్ ఎన్టీఆర్ జన్మదినోత్సవం సందర్భంగా ఈ నెల 20న నెల్లూరు బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. జూనియర్ ఎన్టీఆర్ సేవాసమితి జిల్లా శాఖ అధ్యక్షుడు శింగంశెట్టి రవిచంద్ర ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానులు పావురాల రమేష్, షేక్ బబ్లూ, ఆర్. వెంకటేశ్వర్లు, మహేంద్ర, రమేష్, పృథ్వీ, మస్తాన్, సుమన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## పార్ధివ్ గ్యాంగ్ పుకార్లు నమ్మకండి

**- జిల్లా ఎస్పీ రామకృష్ణ**



నెల్లూరుజిల్లాలో పార్థివ్‌గ్యాంగ్, ఇతర గ్యాంగ్‌లు తిరుగుతున్నాయని సోషల్ మీడియాలో వచ్చిన వార్తలు పుకార్లని నెల్లూరు జిల్లా ఎస్పీ రామకృష్ణ స్పష్టం చేశారు. కొంతకాలం క్రితం బోర్డర్ స్టేట్‌లో పార్థివ్ గ్యాంగ్ కనిపించిందనే సమాచారంతో జిల్లా పోలీసు అప్రమత్తం అయ్యిందన్నారు. మాకు తెలిసిన సమాచారం మేరకు ఆ గ్యాంగ్‌లోని సభ్యులను కర్నాటక రాష్ట్రంలో, ఖమ్మం రైల్వే పోలీసులు అరెస్టు చేసివున్నారని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో పార్థివ్ గ్యాంగ్ కదలికలు ఏమీ లేవు కాబట్టి ప్రజలు కంగారుపడవలసిన అవసరం లేదన్నారు. అపరిచితులు కనపడితే 100కు డయల్ చేయడం గాని, దగ్గర్లోని పోలీసుస్టేషన్లో చెప్పడం కాని చేయాలన్నారు. అంతేగాని, భిక్షగాళ్ళను, అమాయకులను పార్థివ్‌గ్యాంగ్ అంటూ దారుణంగా కొట్టడం, హింసించడం తగదన్నారు.

## 'శుభమస్తు' మినరల్‌వాటర్ చలివేంద్రం




ఏడాది పొడవునా ప్రతిరోజూ 24 గంటల పాటు ఉచిత చలివేంద్రాన్ని, అది కూడా పరిశుద్ధమైన మినరల్‌వాటర్ చలివేంద్రాన్ని నగరంలోని శుభమస్తు షాపింగ్‌మాల్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు పినాకిని ప్రోత్సాహంతో, దివంగత బయ్యా వెంకటరమణయ్య మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ఈ చలివేంద్రం ఏర్పాటైంది. ఈ కార్యక్రమంలో శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేతలు బయ్యా శ్రీనివాసులు, బయ్యా రవికుమార్, లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు పినాకిని అధ్యక్షుడు విక్రమ్, సెక్రటరీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు. ప్రజలు ఈ చలివేంద్రాన్ని వినియోగించుకోవాల్సిందిగా నిర్వాహకులు కోరారు.

## 'నుడా' శీనయ్య క్రీడాపోటీలు



నెల్లూరులోని 54 డివిజన్లలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వాలీబాల్, క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శీనయ్య తెలిపారు. జూన్‌లో ఈ పోటీలను తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారాయన. టీమ్‌కు 14మంది చొప్పున తమ పేర్లను నమోదు చేసుకోవాలని, పోటీలలో పాల్గొనే టీంలకు ఆయా డివిజన్ల టీడీపీ నాయకుల ద్వారా క్రికెట్, వాలీబాల్ కిట్లను ఉచితంగా అందజేస్తామంటున్నారు. ఈ పోటీలలో ప్రథమస్థానంలో నిలిచిన జట్టుకు నారా చంద్రబాబు ట్రోఫీని, నగదు బహుమతిని, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన జట్లకు ట్రోఫీతో పాటు నగదు బహుమతులను అందజేస్తామంటున్నారు. అలాగే మహిళా క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా టెన్నికాయిట్, చెస్, క్యారమ్స్, షటిల్ పోటీలను నిర్వహిస్తామని, ఈ ఆటలకు సంబంధించిన కిట్లను కూడా తామే అందజేస్తామని శీనయ్య చెప్పారు. వివరాలకు 9959954199, 8919927377 నెంబర్‌లలో సంప్రదించాలని ఆయన కోరారు.

2019 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కోటంరెడ్డి శీనయ్య అప్పుడే యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నట్లున్నాడు. అందుకే 54డివిజన్ల యువతపై ముందుగా దృష్టి పెట్టినట్లున్నాడు.

## ఆందోళన బాటలో అర్చకులు

సాధారణంగా దేవాలయాలలో అర్చనలు, పూజలు చేసుకునే అర్చకులకు ధర్నాలు, బంద్‌లు, రాస్తారోకోలు వంటివి తెలియవు. చంద్రబాబు పుణ్యాన అలాంటి అర్చకులు కూడా రోడ్డు మీద చేరి నిరసనలు వ్యక్తం చేస్తున్నారు.

టిటిడి ప్రధానార్చకులు రమణ దీక్షితులను విధుల నుండి తొలగించడాన్ని నిరసిస్తూ నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం అర్చకులు 19వ తేదీ దేవాలయం ముందు ఆందోళన నిర్వహించారు. వంశపారంపర్య అర్చకత్వం హక్కును తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పన్నుతున్న కుట్రలను విచ్ఛిన్నం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా అర్చకులు ఐక్యపోరాటానికి సిద్ధం కావాలని ఈ ఆందోళనలో పాల్గొన్న అర్చక స్వాములు ప్రసాద్ ఆచార్యులు, కిడాంబి జగన్నాథాచార్యులు, ఉదయగిరి వెంకటశేషాచార్యులు పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ నేతల కర్నాటక సంబరం

కర్నాటకలో బిజెపి నాయకుడు యద్యూరప్ప రాజీనామాతో ప్రజాస్వామ్యం గెలిచిందని, ఈ పరిణామాలు ప్రధాని మోడీకి గుణపాఠం చెప్పినట్లయిందని కాంగ్రెస్ నేతలన్నారు. గవర్నర్‌లను అడ్డం పెట్టుకుని బిజెపి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని వారు విమర్శించారు. ఈ నెల 20న కాంగ్రెస్ నగరాధ్యక్షుడు ఉడతా వెంకట్రావు ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ ఆఫీసు వద్ద సంబరాలు చేసారు. ఏఐసిసి సభ్యులు సివి శేషారెడ్డి, చెంచలబాబుయాదవ్ మాట్లాడుతూ, ప్రధాని మోడీ విధానాలను దుయ్యబట్టారు. కర్నాటక పరిణామాలతో మోడీ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. తొలుత కాంగ్రెస్ నాయకులు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు రఘురామ్ ముదిరాజ్, అనురాధారెడ్డి, ఆసిఫ్, ఫయాజ్, బాలసుధాకర్, తిరుపతయ్య, పత్తి సీతారాంబాబు, మంజుల, అల్లాఉద్దీన్ పాల్గొన్నారు.

## కళాకారులకు అవార్డులు



నెల్లూరుకు చెందిన సూక్ష్మచిత్ర కళాకారుడు ముస్సవీర్, చిత్రకారుడు తిరుమలశెట్టి చంద్రలకు ముంబైకు చెందిన ఓ సంస్థ గోల్డెన్ స్టార్ అవార్డులను ప్రదానం చేసింది. వీళ్ళు మలచిన అద్భుత కళాఖండాలను గుర్తించి గౌరవిస్తూ ముంబై నుండి వచ్చిన సంస్థ నిర్వాహకులు డాక్టర్ బింగిన వీరిద్దరికీ అవార్డులు అందజేశారు.

## ఆటోమొబైల్స్ డీలర్స్ కొత్త కార్యవర్గం

ది నెల్లూరు ఆటో మొబైల్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు కొత్త కార్యవర్గం ఏర్పడింది. అధ్యక్షుడిగా శంకర్ ఆటో మొబైల్ అధినేత పొజ్జర్ల శంకర్, గౌరవాధ్యక్షుడిగా ఆడిటర్ ఏవిఎస్ కృష్ణమోహన్, కార్యదర్శిగా కె.సుధాకర్‌రెడ్డి, కోశాధికారిగా ఎస్.రమేష్, ఉపాధ్యక్షులుగా పి.సుధాకర్, పి.వెంకటసత్యన్నారాయణ, సంయుక్త కార్యదర్శిగా మల్లిఖార్జున నాయుడు, సహాయ కార్యదర్శులుగా కె.సురేష్‌బాబు, నాగేశ్వరరావు, గౌరవ సలహాదారులుగా సన్నపరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, కొట్టే రామ్మూర్తిలను ఎన్నుకున్నారు.



నెల్లూరుజిల్లాలో ఎంతో మంది రైతులను లక్షాధికారులను, కోటీశ్వరులను చేసిన ఆక్వారంగం ప్రస్తుతం మార్కెట్ సంక్షోభంలో వుంది. గతంలో రైతాంగాన్ని ఆదుకున్న రొయ్య, ఇప్పుడు వారి జీవితాలతో ఆడుకుంటోంది. అంతర్జాతీయ ఆక్వా మార్కెట్‌లో వస్తున్న ఒడిదుడుకులు, ఆంక్షలు రైతుల పాలిట శాపంగా మారుతున్నాయి. ముఖ్యంగా మార్కెట్‌లో ధరల పతనం, దళారీ వ్యవస్థ ఆక్వారైతుల ఆశలను నీరుగారుస్తున్నాయి.

రొయ్య...

# నాడు ఆదుకుంది... నేడు ఆడుకుంటోంది!

జిల్లాలో దాదాపు 180 కిలోమీటర్ల సముద్ర తీరప్రాంత ముంది. 18కిపైగా మండలాల్లో ఆక్వాసాగు చేస్తుంటారు. తీరప్రాంతాలలో అయితే ఆక్వా వచ్చాక వరి, ఇతర పంటలు వేయడమే మానుకున్నారు. టైగర్, స్కాంపీ పోయి వెనామీ వచ్చాక జిల్లాలో ఆక్వాసాగు విస్తీర్ణం ఇంకా పెరిగింది. ఎందుకూ పనికిరాని ఉప్పుకయ్యలకు కూడా డిమాండ్ వచ్చింది. ఎకరా లీజులు 10వేల నుండి 80వేల రూపాయల దాకా పోయాయి.

ఆక్వాసాగు పేకాట లాంటిదే! ఒక ఆటలో పోతే ఇంకో ఆటలో గెలుద్దామని ఆడుతూనే వుంటారు. ఇలా అన్ని ఆటలు పోగొట్టుకుంటారు. ఆక్వాలో ఒకసారి పంటలో నష్టం వస్తే ఇంకోసారైనా లాభం రాకపోతుందా అని వేస్తూనే వుంటారు. ఇలా వేస్తూ చాలా మంది వరుస నష్టాలతో అప్పులపాలయ్యారు.

రొయ్య రైతులకు లీజులు, నకిలీ సీడ్, నకిలీ ఫీడ్, కరెంట్, నీళ్ళు, అధిక ఉష్ణోగ్రతలు, వైరస్ అన్నవి సాధారణంగా వుండే సమస్యలు, ఇవన్నీ ఒకెత్తయితే పంటను తీసి మార్కెట్‌కు పంపించే సరికి ధరలు పతనమవుతుండడం మరో ఎత్తు.

## అంతర్జాతీయ మార్కెట్‌లో సంక్షోభం...

అంతర్జాతీయ మార్కెట్‌లో సంభవించిన కొన్ని కారణాల మూలంగా రొయ్యల ధరలు పడిపోయాయి. గత ఏడాది ఇదే సమయంలో 50 కౌంట్ కిలో 330 రూపాయలుంటే ఇప్పుడు 210 రూపాయలకు పడిపోయింది. ఇలా వంద కౌంట్, 30 కౌంట్ ధరల్లో కూడా బాగా తేడా వచ్చింది.

అంతర్జాతీయంగా పలు దేశాల నుండి రొయ్యల ఉత్పత్తి అధికమైంది. నిషేధిత యాంటీబయాటిక్స్‌పై అమెరికా, యూరో పియన్ యూనియన్‌లలో ఆంక్షలు విధించారు. ఈ రెండు దేశాలతో పాటు చైనాలోనూ యాంటీ డంపింగ్ డ్యూటీని పెంచారు. వీటి ప్రభావం ఆక్వా మార్కెట్‌పై బాగా పడింది. రైతులకు ఈ అంతర్జాతీయ పరిణామాలేవీ తెలియవు. వాళ్ళ పద్ధతిలో వాళ్ళు రొయ్యలు సాగుచేసి పంట తీస్తున్నారు. వీటిని సాకు చూపి దళారులు మరీ ధరలు తగ్గించి రొయ్యలు కొనుగోలు చేస్తున్నారు. పచ్చి సరుకు... నిల్వ చేసుకునే పరిస్థితి లేదు. కాబట్టి వచ్చిన ధరకే రైతులు తమ కష్టాన్ని తెగనమ్ముకుంటున్నారు.

# కార్యకర్తలే మా సైన్యం... మా ధైర్యం!

### - రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి



మెడికల్ క్యాంపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుర్తుమీద ఎన్నికల్లో గెలిచిన కొందరు ప్రజాప్రతి నిధులు కాసుల కక్కుర్తితో, అధికారం కోసం పార్టీని వదిలివెళ్ళినా కార్యకర్తలు మాత్రం ఎంతోకాలం నుంచి వేధింపులు తట్టు కుంటూ, కష్టాలకు ఓర్చుకుంటూ పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న తీరు చూసి గర్వపడుతున్నానని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు.

వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 2000 కిలో మీటర్ల పాదయాత్ర పూర్తయిన సంద ర్భంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గం లోని 33, 34 డివిజన్ల వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కమిటీల ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ ఎన్‌సిసి కాలనీలో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లా డుతూ, వైఎస్ జగన్ పాదయాత్ర దేశ రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తోంద న్నారు. జగన్ పాదయాత్రకు వస్తున్న స్పందన జాతీయస్థాయిలో చర్చగా మారిం దన్నారు. జగన్‌కు తోడుగా, నీడగా రాష్ట్రంలో లక్షలాదిమంది పార్టీ కార్యకర్తలు ఎంతో ఉత్సాహంగా కార్యక్రమాలు నిర్వ హించడం ఎంతో సంతోషంగా ఉంద న్నారు. గుండెల్లో రాజశేఖర్‌రెడ్డిని, శిరసున జగన్మోహన్‌రెడ్డిని పెట్టుకుని, చేతిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా పట్టుకుని పార్టీ పటిష్టత కోసం, ప్రజాసమస్యల పరి ష్కారం కోసం కార్యకర్తలు నిరంతరం పోరాడుతున్న తీరు దేశంలో అన్ని రాజ కీయపార్టీలకు ఆదర్శంగా ఉందన్నారు. భవిష్యత్తు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదేనని, కష్టకాలంలో జెండా మోసిన ప్రతి కార్యకర్త రుణం తీర్చుకుంటామన్నారు.

# బదిలీలు పారదర్శకంగా ఉండాలి - కలెక్టర్ ముత్యాలరాజు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు

జిల్లాలోని ప్రతిశాఖలో నిబంధనల మేరకు బదిలీలను పారదర్శకంగా జర పాలని జిల్లా కలెక్టర్ ఆర్ ముత్యాలరాజు అన్నారు. ఈ నెల 19న ఆయన తన క్యాంప్ కార్యాలయంలో అన్నిశాఖల జిల్లా అధికా రులతో సమావేశమయ్యారు. నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు చేయకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి గైడ్‌లైన్స్ కూడా వచ్చాయన్నారు. ఇటీవల జిల్లాలో పర్యటించిన షెడ్యూల్ కులాల సంక్షేమ శాసనసభా కమిటీ సమావేశంలో 45 శాఖల అధికారులు రోస్టర్ రిజిష్టర్లను కమిటీకి సమర్పించడంలో విఫలమయ్యా రని, సమావేశానికి అధికారులు రాకుండా కిందిస్థాయి ఉద్యోగులను పంపారంటూ, రోస్టర్ రిజిస్టర్లను ఇవ్వని శాఖల అధికా రులకు షోకాజ్ నోటీసులు జారీచేయాలని సంబంధిత అధికారిని కలెక్టర్ ఆదేశిం చారు. తనకు పంపే ప్రతి ఫైల్‌ను కూడా అధికారులు అసంపూర్తిగా పంపుతున్నారని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ఫైల్‌ను పరిశీలించి తనకు పంపించా లన్నారు. ప్రతిశాఖలో ఫైళ్ళను తాను వచ్చే వారం నుంచి ఇ-ఆఫీసు పర్యవేక్షణలో వుంచి క్షుణ్ణంగా పరిశీలిస్తానన్నారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జేసీ-2 వెంకటసుబ్బారెడ్డి, డిఆర్‌ఓ వెంకటసుబ్బయ్య, సిపిఓ పిబికె మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## మోడీకి సవాల్ విసిరిన మొనగాడు

# మన చంద్రబాబునాయుడు

### వింజమూరు మినీమహానాడులో సోమిరెడ్డి



వింజమూరులో జరిగిన మినీ మహానాడులో మాట్లాడుతున్న మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ఢిల్లీ స్థాయిలో ప్రధాని నరేంద్రమోడీని ఢీకొట్టి ఆయనకు చుక్కలు చూపిస్తున్న మొనగాడు మన చంద్రబాబునాయుడేనని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పుకొచ్చారు. 20వ తేదీ వింజమూరు జడ్పీ బాలుర హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన ఉదయగిరి నియోజకవర్గ మినీ మహానాడులో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్యకర్తలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ళుగా బీజేపీ నియంత మోడీకి అందరూ భయపడి చస్తున్నారని, చంద్రబాబు మాత్రం ఎదురు తిరిగి మోడీనే భయపెడుతున్నాడని చెప్పారు. చంద్రబాబు ఇచ్చిన పిలుపుతోనే కర్నాటక ప్రజలు బీజేపీకి బుద్ధి చెప్పారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రం కోసం చంద్రబాబు ఎంతో పోరాడాడు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రం చుట్టూ చక్కర్లు కొట్టాడు. బీజేపీ చేస్తున్న మోసాన్ని సహించలేకే ఎన్డీఏ నుండి బయటకొచ్చా డన్నారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన బీజేపీతో మాత్రం ప్రతిపక్ష వైసిపి చెట్టపట్టా లేసుకుని తిరుగుతోందని, ఈ రెండు పార్టీలకు గుణపాఠం చెప్పాలని సోమిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ నాలుగేళ్లలో ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చిన ఘనత చంద్రబాబు ప్రభుత్వానిదేనన్నారు.

ఉదయగిరి ఎమ్మెల్యే బొల్లినేని రామారావు ఈ నాలుగేళ్ళలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీని వాసులురెడ్డి, టీడీపీ నాయకులు మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, దంతులూరి వెంకటేశ్వర్లు, నాయుడు రాంప్రసాద్, పి.నారాయణరెడ్డి, గణపం సుదర్శన్‌రెడ్డి, చల్లా వెంకటేశ్వర్లు, గొంగటి రఘునాథరెడ్డి, గూడా నరసారెడ్డి, గిరిజాల వెంకటరమణయ్య, యన్నం రామచంద్రారెడ్డి, ఇ.మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలకు అతీతంగా పోరాడాలి

### 'హోదా' కోసం మాగుంట శరత్‌చంద్ర ఆధ్వర్యంలో వినూత్న నిరసన




రాష్ట్రానికి ప్రత్యేకహోదా వస్తేనే యువతకు ఉపాధి, రాష్ట్రానికి అభ్యున్నతి సాధ్య మవుతుందంటూ, ప్రత్యేకహోదా సాధన కోసం అందరూ పోరాటం చేయాలని పిలుపు నిస్తూ నెల్లూరులోని మాగుంట శరత్‌చంద్రారెడ్డి యువజన సేవాసమితి ఆధ్వర్యంలో ఇటీవల వినూత్నరీతిలో ర్యాలీ నిర్వహించారు. పార్టీలకు అతీతంగా అందరు నాయకులు, అన్ని వర్గాల ప్రజలు కదిలిరావాలంటూ అన్ని పార్టీల కండువాలను మెడలో వేసుకుని సేవాసమితి సభ్యులందరూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు.

నెల్లూరు విఆర్‌సి కూడలి వద్ద నుంచి గాంధీబొమ్మ వరకు సాగిన ఈ ర్యాలీ అందరినీ బాగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సేవాసమితి వ్యవస్థాపకుడు మాగుంట శరత్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ, ప్రత్యేకహోదా సాధన కోసం రాజకీయపార్టీలవారు జెండాలను పక్కనపెట్టి, హోదా సాధనే ధ్యేయంగా పోరాటం చేయాలన్నారు. యువత అంతా ఈ పోరాటంలో ముందుంటుందని ఆయన పేర్కొన్నారు. విభజనతో అన్యాయానికి గురైన రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధనతోనే తిరిగి నిలదొక్కుకునే అవకాశం ఉంటుందని అంటూ, ప్రత్యేకహోదా లేని రాష్ట్రం ఎందు కని ఆయన ఉద్వేగంతో అన్నారు. ఈ కార్యక్ర మంలో సేవాసమితి ప్రతినిధులు సంజయ్ బాబు, కె.లెక్కిన్‌రెడ్డి, సిహెచ్ మహేష్, రుషి చౌదరి, కె.అశోక్, నూనె రుషియాదవ్, సాయి బాబు, డి.మహేష్, సాయికృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# నిజాయితీగా పనిచేయండి

## - నూతన సిబ్బందికి జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ హితవు





పోలీసు శిక్షణ పూర్తిచేసుకుని కొత్తగా విధులు చేపడుతున్న సిబ్బంది నిజాయితీతో పనిచేసి పోలీసుశాఖకు మంచిపేరు తీసుకురావాలని జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ ఆకాంక్షించారు. నెల్లూరు చెముడుగుంటలోని జిల్లా పోలీసుశిక్షణ కళాశాలలో 166 మంది సివిల్, 32 మంది ఏ.ఆర్, 73 మంది మహిళా కానిస్టేబుల్స్ శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లోకి వస్తున్న సందర్భంగా ఈ నెల 19న వారికి స్వాగత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, క్రమశిక్షణ కలిగిన పోలీసు శాఖలోకి కొత్తగా వచ్చే సిబ్బంది ఎంతో సమయస్ఫూర్తితో వ్యవహరించాలన్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. ప్రతిభ ఆధారంగా రైటర్, కంప్యూటర్ ఆపరేటర్లుగా రాణించేందుకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. సాంకేతిక అనుభవం ఉన్న యువతను ఐటీ కోర్, టెక్నికల్ టీమ్‌లలోకి తీసుకుని తగు శిక్షణ అందిస్తామన్నారు. పోస్టింగ్‌ల కోసం పైరవీలు చేయవద్దని, అలా చేస్తే కఠినచర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అదనపు ఎస్పీ, పోలీస్‌శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ బి. శరత్‌బాబు, ఏఆర్ ఏఎస్పీ వీరభద్రుడు, డిఎస్పీ చంద్రశేఖర్, ఆర్‌ఐలు మౌలాలి, చంద్రమోహన్, పురుషోత్తం పాల్గొన్నారు.

# గోరేటి వెంకన్నకు సన్మానం



ప్రముఖ కవి, జానపద గాయకుడు గోరేటి వెంకన్నకు ఈ నెల 19న నెల్లూరులోని ఆదిత్య డిగ్రీకాలేజీలో తెలుగు భాషోద్యమ సమితి వ్యవస్థాపకుడు ఆచార్య ఆదిత్య ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటుచేసి, గోరేటి వెంకన్నను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య ఆదిత్య మాట్లాడుతూ గోరేటి వెంకన్న పాటలను, ఆయన సాహితీ ప్రతిభను కొనియాడారు. వీరి జానపద పాటలు నేటి సమాజం తీరుతెన్నులను కళ్లకు కట్టినట్లు ఉంటాయని, సామాన్య ప్రజలను, చిన్న పిల్లలను సైతం ఆ పాటలు ఆకట్టుకునే విధంగా ఉంటాయని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా గోరేటి వెంకన్న బృందం కొన్ని పాటలను ఆలపించి అందరినీ అలరించారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణారెడ్డి, వెంకటరెడ్డి, ఎన్‌వి దశరధరామిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రచయిత పోట్లూరు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసకుమార్, చదలవాడ రమణయ్య, మహీధర్, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# నాలుగున్నర కోట్లతో బీసీ భవన్

నెల్లూరు నగరంలో నాలుగున్నర కోట్ల రూపాయల వ్యయంతో బీసీ భవన్ నిర్మించనున్నామని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు తెలిపారు. ఈ నెల 21న ఆయన తన ఛేంబర్‌లో అధికారులతో సమావేశమై మాట్లాడుతూ, బీసీ భవన్ నిర్మాణానికి అనుమతి ఇస్తూ ప్రభుత్వం జిఓ నంబర్ 61 విడుదల చేసిందన్నారు. హరిత టూరిజం హోటల్ పక్కనున్న స్థలంలో ఆ మేరకు బీసీ భవన్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ వి.వెంకటసుబ్బయ్య, ఆర్డీఓ హరిత ఉన్నారు.

## నేరాల నియంత్రణకు..

# ప్రజలు సహకరించాలి

## - డిఎస్పీ రాంబాబు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డిఎస్పీ రాంబాబు. పక్కన సిఐ అక్కేశ్వరరావు, ఎస్‌ఐలు

## డివిజన్ గూడూరు వార్తలు

నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని గూడూరు డిఎస్పీ రాంబాబు అన్నారు. గూడూరు 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 20న జరిగిన సదస్సులో ప్రజలకు నేరాల నియంత్రణ పట్ల అవగాహన కల్పించారు. రూరల్ సిఐ అక్కేశ్వరరావు, ఎస్‌ఐల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిఎస్పీ రాంబాబు మాట్లాడుతూ, గతంలో చోరీలు జరిగితే పోలీసులు ఎంతో శ్రమపడి నిందితులను పట్టుకునేవారని, ఇప్పుడు ఆధునిక శాస్త్ర పరిజ్ఞానంతో సిసి కెమెరాలు, లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టమ్ వంటి వాటి ద్వారా నేరాలు జరగకుండా చూసేలా పోలీసులు కృషి చేస్తున్నారన్నారు. ప్రధానంగా వాట్సప్, ఫేస్‌బుక్, ఏటిఎం పిన్ నంబర్లను పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు నేరగాళ్ళు ఎత్తుకు పైఎత్తులు వేస్తూ జోరుగా నేరాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ నేరాలను నియంత్రించాలంటే ప్రజలు సహకరించాలని, అందరూ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. జాతీయ రహదారిపై నేరాలు, తాళం వేసిన ఇళ్ళలో చోరీలు, శివారు ప్రాంతాల్లో ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దోపిడీలు చేస్తున్నారని, అందువల్ల అలాంటి నేరాలకు అవకాశం ఇవ్వకుండా ఆయా ప్రాంతాల్లోని ప్రజలు జాగ్రత్తలు తీసుకుంటూ ఉండాలన్నారు.

ఈ కార్యక్రమంలో సిఐ అక్కేశ్వరరావు మాట్లాడుతూ, జిల్లాలో ఏర్పాటు చేసిన లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా కమాండ్ కంట్రోల్‌కు అందిన సమాచారంతో అప్రమత్తమై పలు చోరీలను నివారించగలిగామన్నారు. ప్రధానంగా వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్లు, స్కూల్స్ ఇతర ముఖ్యమైన భవనాల్లో ఖచ్చితంగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల చోరీల నియంత్రణకు వీలవుతుందన్నారు. ఎస్‌ఐలు శేఖర్‌బాబు, బాబీ, శ్రీనివాసులురెడ్డి, హుస్సేన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ళ నిర్మాణాలను తనిఖీ చేసిన కలెక్టర్



ఇళ్ళ నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ముత్యాలరాజు. పక్కన ఆర్డీఓ అరుణ్‌బాబు తదితరులు

అందరికీ ఇల్లు (హౌస్ ఫర్ ఆల్) పథకంలో భాగంగా గూడూరు పట్టణంలోని 1వ వార్డులో జరుగుతున్న ఇళ్ళ నిర్మాణాలను జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు మంగళవారం తనిఖీ చేశారు. తొలుత, పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించి రికార్డులను పరిశీలించారు. ఆ తర్వాత ఇళ్ళ నిర్మాణాల తీరును పరిశీలించి, లబ్ధిదారులతోను, సంబంధిత అధికారులతోనూ మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారులు పొంతన లేని సమాధానాలు చెప్తుండడంతో అధికారులు తీరు మార్చుకోవాలని కలెక్టర్ గట్టిగా హెచ్చరించారు.

జిల్లాలో ఈ ఏడాది 400 కోట్ల రూపాయల నిధితో జాతీయ ఉపాధి హామీ పనులు చేపట్టేలా లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. 2017-18 సంవత్సరానికి గూడూరు పట్టణంలో హౌస్ ఫర్ ఆల్ పథకం కింద సొంతస్థలం కలిగిన లబ్దిదారులకు 1,125 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. వీటిలో 431 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు. 'మీ భూమికి భరోసా' కార్యక్రమం ద్వారా రైతులకు సంబంధించిన భూముల వివరాలు సరిచేస్తున్నామన్నారు. హౌసింగ్‌కు సంబంధించిన భూములు గుర్తించామన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై పట్టణ ప్రజలు కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించగా, ఆ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అరుణ్‌బాబు, గృహనిర్మాణశాఖ ప్రాజెక్ట్‌డైరెక్టర్ రామచంద్రారెడ్డి, పురపాలకసంఘం కమిషనర్ నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతి సమ్మేళనం అధ్యక్షుని రాజీనామా



మాట్లాడుతున్న సిద్దారెడ్డి జనార్దన్‌రెడ్డి, కె. మునిగిరీష్ తదితరులు

గూడూరు సంస్కృతి సమ్మేళనం అధ్యక్షునిగా బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు సిద్దారెడ్డి జనార్ధన్‌రెడ్డి తెలిపారు. గూడూరులోని ఆయన నివాసంలో ఈ నెల 22న ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎంతో ప్రాముఖ్యం ఉన్న ఈ సంస్థకు అధ్యక్షునిగా పనిచేయడం ఎంతో సంతోషకరమని, అయితే వ్యక్తిగత కారణాల వల్ల తాను అధ్యక్షునిగా తప్పుకుంటున్నానని అన్నారు. సంస్థ ప్రతినిధి కె.మునిగిరీష్ మాట్లాడుతూ, గత 15 ఏళ్ళుగా నిరాటంకంగా గూడూరు సంస్కృతి సమ్మేళనం సాంస్కృతిక పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సోమిశెట్టి చెంచురామయ్య, జానా శివయ్య, కట్టా మురళీకృష్ణ, నాగేశ్వరరావు, జీజీ నాయుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



గూడూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నిర్మించిన సందర్శకుల గదిని ఇటీవల ప్రారంభించిన ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, దాత మరియు విఎస్‌ఆర్ స్కూల్ అధినేత ఎన్.బాలకృష్ణమరాజు, ఎంపిడిఓ, రోటరీక్లబ్ అధ్యక్షులు మునిరాజా, రోటరీ ప్రతినిధులు కె.మునిగిరీష్, దశరధరామిరెడ్డి, జానకిరామిరెడ్డి, నాగసూరి గోపాలరావు, ఎన్‌వి రత్నం, హరిప్రసాద్, వాసుగౌడ్ తదితరులు.

# రాశి - మీ వాసి



**బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు**
బాలాజీనగర్, నెల్లూరు

**తేది. 25.5.2018 నుండి**
**తేది. 31.5.2018 వరకు**

ఈ వారము కన్య, తుల, వృశ్చిక, ధనుురాశులలో చంద్రుడు, మేషంలో బుధుడు, 27వ తేది నుండి వృషభంలో బుధుడు, వృషభంలో రవి, మిధునంలో శుక్రుడు, కర్కాటకంలో రాహువు, తులలో గురువు, ధనుస్సులో శని, మకరంలో కుజ కేతువులు సంచరిస్తారు.

**పంచాంగము :**
తేది. 29 మంగళవారము కర్తరి సమాప్తము
అధిక జ్యేష్ఠమాసం జరుగుతున్నది. ముహూర్తములు లేవు

**అధిక జ్యేష్ఠ మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 25 | శుక్ర | ఏకాదశి | రా॥ గం.7.05ని॥ |
| తేది. 26 | శని | ద్వాదశి | రా॥ గం.6.19ని॥ |
| తేది. 27 | ఆది | త్రయోదశి | సా॥ గం.6.00ని॥ |
| తేది. 28 | సోమ | చతుర్దశి | సా॥ గం.6.12ని॥ |
| తేది. 29 | మంగళ | పూర్ణిమ | రా॥ గం.6.53ని॥ |

**అధిక జ్యేష్ఠ మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 30 | బుధ | పాడ్యమి | రా॥ గం.8.0ని॥ |
| తేది. 31 | గురు | విదియ | రా॥ గం.9.36ని॥ |

## మేషం



అశ్విని, భరణి, కృతిక 1 పాదము

చేయదలచుకున్న పనులు సమర్ధవంతంగా చేస్తారు. పెండింగ్‌లో పడిన పనులు మరలా ప్రారంభం కాగలవు. వృత్తి వ్యాపారాలు వేగం పుంజుకుని ఆర్ధికంగా స్థిమితం ఉంటుంది. ఆదాయం బాగుంటుంది. నిర్మాణాలు కొన సాగుతాయి. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు రుణాలు లభిస్తాయి. రావలసిన బాకీలపై వత్తిడి పెంచుతారు. బిడ్డలకు ఉన్నత విద్యావకాశాలుంటాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు రుణాలు లభిస్తాయి. బంధు ముఖ్యులకు అనారోగ్య వార్తలు వింటారు. వృత్తి వ్యాపారాలను బాగా వృద్ధి చేస్తారు. ఆదాయం బాగుంటుంది. బంధుమిత్రులు సహాయం అర్ధించవచ్చును. ముఖ్యమైన పత్రాలు, రావలసిన బాకీలు అందుతాయి. స్థిరాస్తుల లావాదేవీలు జరుగగలవు. ఉద్యోగావకాశాలు బాగుంటాయి. అనవసర విషయాలలో జోక్యం వద్దు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఏదో ఒకరూపంలో ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. వృత్తిజీవన సంపాదన బాగుంటుంది. వ్యాపారవర్గాలు అభివృద్ధికై శ్రమపడాలి. ఆదాయం సామాన్యం. వ్యాపకం పెరిగి అనేకపనులతో ఇబ్బంది పడుతుంటారు. కుటుంబ సభ్యుల మధ్య సామరస్యం తగ్గి విభేదాలుంటాయి. శుభకార్య ప్రయత్నాలు అనుకూలించగలవు. ప్రముఖులను ఆత్మీయులను కలుసుకుంటారు.


## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

వృత్తి వ్యాపారాలు లాభాలను సమకూరుస్తాయి. తొందరపాటు నిర్ణయాలు చేయవద్దు. ముఖ్య పత్రాలు అందుకుంటారు. పన్నుల చెల్లింపులు జరుగుతాయి. దూరప్రయాణాలుంటాయి. కుటుంబవ్యవహారాలు సమస్యలు సర్దుబాటు కాగలవు. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడు తాయి. ఉద్యోగ ప్రయత్నాలు ఫలించే అవకాశం ఉన్నది. కొత్త కాంట్రాక్టులు, ఏజెన్సీలు లభించగలవు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

చిన్న వృత్తులు, వ్యాపారాలు జరుపుకునేవారికి ఆదాయం బాగుంటుంది. ఇతరులను బాధపెట్టే మాటలు, పనులకు పూనుకోనవద్దు. విలువైన వస్తువులు, కాగితాలు జాగ్రత్త. ప్రభుత్వపరంగా పనులు, అంద వలసిన ఆదాయం పొందుతారు. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరిగి, ఆదాయానికి తగిన ఖర్చులుంటాయి. చేపట్టిన పనులకు మధ్య ఆటంకాలుంటాయి.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆర్ధికపరంగా చిక్కులుంటాయి. అయితే డబ్బుకు అంతగా ఇబ్బంది ఉండదు. పెండింగ్‌లో సమస్య పోయి మీకు అనుకూలత బాగుంటుంది. వ్యాపారవర్గాలకు ఆశించిన అభివృద్ధి ఉండదు. ఆదాయం సామాన్యం. వృత్తి జీవనం కలవారికి రాబడి బాగుంటుంది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేయండి. విమర్శలను లెక్కచేయకండి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ప్రవర్తన, మాటలలో దుడుకుతనం తగ్గించుకోవాలి. చేస్తున్న మీ పనుల ప్రయత్నాలు వత్తిడితో జరుగుతాయి. వృత్తి వ్యాపారాలలో పురోగతి, ఆదాయం పెరగడం ఉంటుంది. ఉద్యోగులు అధికారులతో సఖ్యతగా ఉంటారు. స్థిరాస్తుల లావాదేవీలకు అవకాశాలుంటాయి. ఉద్యోగార్థులకు అవకాశాలు లభించగలవు. ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. ఆరోగ్యం బాగుంటుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

తొందరపాటు ఎక్కువగా ఉంటుంది. స్థిమితంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకొనండి. స్థిరాస్తులపై ఆదాయముంటుంది. వృత్తి వ్యాపార విషయంలో అభివృద్ధి, ఆదాయము బాగుంటుంది. ఉద్యోగులు తమ అధికారులతోను, ప్రజలతోను జాగ్రత్తగా మెలగండి. అనుకున్న పనులు జరుగుతున్నా వత్తిడి ఎక్కువగా ఉంటుంది. కొన్ని అనవసర ఖర్చులు తప్పవు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

లౌకిక వ్యవహారాలను, ఇంటి వ్యవహారాలను జాగ్రత్తగా నిర్వహించండి. ఆర్థికస్థితి బాగుంటుంది. వృత్తి వ్యాపారాలు వేగం పుంజుకుంటాయి. ఆదాయం బాగుంటుంది. అయినా ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. కొత్త ఆర్థిక ప్రయత్నాలు ప్రారంభిస్తారు. పారిశ్రామిక, కాంట్రాక్ట్ రంగాల వారికి ప్రోత్సాహం, అవకాశాలు బాగుంటాయి. షేర్లలో లాభాలు ఉంటాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వృత్తి వ్యాపారాలలో అభివృద్ధికి అవకాశం బాగుంది. ఆదాయం సంతృప్తికరం. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. మాట హామీలు, రుణాలు ఇవ్వవద్దు. మిమ్మల్ని విమర్శించేవారుంటారు. కాబట్టి పొరపాట్లను సరిదిద్దుకొనండి. పెట్టుబడులకు అవకాశాలు, ఉద్యోగార్థులకు అవకాశాలు బాగుంటాయి. రావలసిన బాకీలు నిలబడిపోవచ్చును. ఆరోగ్యం బాగుంటుంది.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆర్థిక వ్యవహారాలలో చిన్న ఇబ్బందులుంటాయి. అందుకని చేస్తున్న పనుల మీద దృష్టి పెట్టండి. వ్యాపార వృద్ధి అవకాశాలు అందుబాటు కాకపోవచ్చును. సామాన్య, ఆదాయముంటుంది. చేపట్టిన పనులు నిదానంగా జరుగుతాయి. స్థిరాస్తులపై కొంత రాబడి ఉంటుంది. ఉద్యోగులకు పనిభారం, వత్తిడి ఉంటుంది. ఉద్యోగార్థులు దీక్షతో ప్రయత్నాలు చేయండి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

అనుకున్న పనులు వేగవంతంగా సాగుతాయి. కొత్త పెట్టుబడులకు, వ్యాపారవృద్ధికి అవకాశాలు బాగుంటాయి. అనుకోని ప్రయాణాలుంటాయి. బంధువర్గాన్ని కలుసుకుంటారు. వస్తు లాభము, రావలసిన బాకీలు లభించుట, ప్రభుత్వ కార్యాలయాలందు పనులు అనుకూలమగును. విద్యార్థులకు మంచి విద్యావకాశాలు దొరుకుట, కుటుంబసౌఖ్యము బాగుండును.

# బాబు లేకే బీజేపీకి కష్టం

శ్రీను గల్పిక

## భేతాళకథ

పట్టువదలని విక్రమార్కుడు ఎర్లీ మార్నింగ్ ఎయిట్‌థర్టీకల్లా నిద్ర లేచాడు. కాలకృత్యాలు తీర్చుకుని స్నానం చేసి తన గది నుండి బయటపడ్డాడు. మూలాపేట సెంటర్‌లో బిర్యాని తిని మద్రాసుబస్టాండ్ వద్దకొచ్చి ఒక ఆటో ఎక్కి పెద్దాసుపత్రి వద్ద దిగాడు. పెద్దాసుపత్రిలోని మార్చురీ వద్దకు వెళ్ళి ఫ్రెష్‌గా వున్న బాడీని చూసుకుని భుజాన వేసుకుని జీఎన్‌టీ రోడ్డు మీదుగా బోడిగాడితోటలోని రోటరీ క్లబ్ శ్మశానవాటిక వైపు నడవసాగాడు. టీటీడీ కళ్యాణ మండపం దాకా వెళ్ళేసరికి కాస్తున్న ఎండదెబ్బకు విక్రమార్కుడికి చెమటలు కారసాగాయి. ఇక లాభం లేదు... ఈ భేతాళుడు రాత్రి బాగా తాగి నిద్రపోతున్నట్లున్నాడు... ఇక నేను నడవ లేను... ఈ బాడీని ఆటోలో వేసుకుని పోదామనుకుని ఆటోను ఆపి బాదుగ మాట్లాడుతున్నంతలో బాడీలోని భేతాళు డికి మెలకువ వచ్చింది. వెంటనే అతను విక్రమార్కుడితో... రాజా, మనుషులు సైతం నడవడానికి భయపడే ఈ ఎండల్లో నువ్వు పడుతున్న కష్టం చూస్తుంటే నాకు జాలి, దయ రెండూ కంబైన్డ్‌గా కలుగుతున్నాయి. నీకు శ్రమ తెలియకుండా వుండేందుకు లేటెస్ట్ పొలిటికల్ స్టోరీ షార్ట్ ఎడిటింగ్‌లో చూపిస్తాను, అలా డిఆర్ బార్‌కు పోదాం పద అంటూ తీసు కెళ్ళాడు. బార్‌లో కూర్చున్నాక భేతాళుడు నాలుగు బీర్లు ఆర్డర్ చేసి కథ చెప్పడం మొదలుపెట్టాడు.

రాజా, ఇటీవలే కర్నాటకలో జరిగిన ఎన్నికల్లో ఏ పార్టీకి పూర్తి మెజార్టీ రాక హంగ్ ఏర్పడింది. పెద్ద పార్టీగా ఏర్పడ్డ బీజేపీని ప్రభుత్వం ఏర్పాటు చేయమని గవర్నర్ ఆహ్వానించడం, యడ్యూరప్ప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం చకచక జరిగిపోయాయి. బీజేపీ పూర్తి మెజార్టీకి 8 సీట్ల దూరంలో ఆగిపోయింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీజేపీ నాయకులు ఆ 8 మందిని ఎలా గైనా కొనాలని బేరసారాలు మొదలు పెట్టారు. ఈలోపు కాంగ్రెస్, జేడీఎస్ పార్టీలు తమ ఎమ్మెల్యేలను క్యాంపుకు తరలించుకుపోసాగాయి. కర్నాటకలో ప్రజాస్వామ్యం హత్యకు గురైందని, రాజ్యాంగ విలువలను బీజేపీ కాల రాసిందని రాజ్యాంగ రక్షక బిరుదాంకితుడు, తనకు అవసరం లేకపోయినా ప్రతిపక్ష పార్టీకి చెందిన ముగ్గురు ఎంపీలను, 23మంది ఎమ్మెల్యేలను హోల్ సేల్‌గా కొని రాజ్యాంగ విలువలను తు.చ తప్పకుండా పాటించిన చంద్రబాబు నాయుడు భలే బాధపడ్డాడు. యడ్యూరప్ప ముఖ్యమంత్రిగా వున్న ఆ 3రోజులు ఆయన తిండి తినలేదు. కునుకూ తీయలేదు. ఎమ్మెల్యేలను సంతలో పశువుల్లా కొంటారా అని ఆవేదన చెందాడు. ఎట్టకేలకు కొనుగోలు తంతు లేకపోవ డంతో ఊపిరిపీల్చుకుని ఇప్పుడు ప్రశాంతంగా కడుపుకు రెండు పుల్కాలు తింటున్నాడు. కర్నాటక సంఘటనపై రాహుల్ గాంధీ కూడా భలే సీరియస్ అయ్యాడు. గతంలో ఎన్నో రాష్ట్ర ప్రభుత్వాల ఉసురు తీసిన కాంగ్రెస్ పార్టీయే భారత ప్రజాస్వామ్యాన్ని రక్షించగలదని, బీజేపీ రాజ్యాంగ హననానికి పాల్పడిందని ఆవేదన వ్యక్తం చేసాడు. ఇక తెలుగు మీడియా(పచ్చ) ఛానెల్స్ అయితే బీజేపీపై విరుచుకుపడ్డాయి. పచ్చ ఛానళ్ళ ప్రతినిధులే ప్రత్యర్థులుగా మారి టీవీ చర్చా వేదికలలో బీజేపీ నాయకులను ఉతికి ఆరేసారు. ఈ పరిస్థితులు ఇలా వుండగా కాంగ్రెస్ సుప్రీంకోర్టులో మెజార్టీ వున్న తమను కాదని, గవర్నర్ బీజేపీని ఆహ్వానించడం రాజ్యాంగ విరుద్ధమంటూ పిటిషన్ వేసింది. ఈ పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు బల నిరూపణకు గవర్నర్ ఇచ్చిన రెండువారాల గడువును ఒక్కరోజుకు తగ్గించేసింది. గవర్నర్ 15 రోజుల గడువు ఇచ్చాడుగా... తాపీగా బేరసారాలు చేసి కనీసం 10మంది ఎమ్మెల్యేలనన్నా లాగొచ్చులే అనుకున్న బీజేపీ నాయకులకు సుప్రీం ఇచ్చిన గడువుతో గొంతులో పచ్చి వెలక్కాయ ఇరుక్కుంది. అప్పటికప్పుడు హడావిడి చేసినా ఒక్క ఎమ్మెల్యేను కూడా కొనలేక పోయారు. సీన్ ముందే వూహించిన యడ్యూరప్ప బలనిరూపణకు పోకుండానే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి ఏడుస్తూ వెళ్ళిపోయాడు. యడ్యూరప్ప రాజీనామా చేయగానే ప్రజాస్వామ్యం బ్రతికి బీరకట్టిందని ప్రజాస్వామ్య పుత్రుడు చంద్రబాబు ప్రకటించాడు. ఇది రాజ్యాంగ విజయమంటూ రాహుల్ గాంధీ నొక్కివక్కాణించాడు. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ భారీగా బాణాసంచా కాల్చి తన కార్యకర్తలకు బెంగాలీ స్వీట్స్ పంచింది. ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్ ఆనందంతో చీపుర్లు పట్టుకుని రోడ్లు వూడ్చాడు. హైదరాబాద్‌లో కేసీఆర్ టీఆర్ఎస్ కార్యకర్తలకు పెద్ద దావత్ ఏర్పాటు చేశాడు. తీహార్‌లో ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్‌యాదవ్ పీకల దాకా పచ్చిగడ్డి తిని పండగ చేసుకున్నాడు. బీజేపీ అధికారంలో వున్న మూడ్రోజులు తమతమ ఛానెల్స్‌లో ఏడుస్తూ వార్తలు చెప్పిన న్యూస్ రీడర్లు, యాంకర్‌ల ముఖాలలో బీజేపీ దిగి పోగానే ఆనందం వెల్లివిరిసింది. వారి ముఖాలు మతాబుల్లా వెలిగిపోయాయి... అని భేతాళుడు స్టోరీ ముగించి.. రాజా, కేంద్రంలో ప్రభుత్వాన్ని పెట్టుకుని కూడా బీజేపీవాళ్ళు కేవలం 8మంది ఎమ్మెల్యేలను ఎందుకు కొనుక్కోలేకపోయారు. ఈ ప్రశ్నకు సమాధానం తెలిసినా తెలియకపోయినా నచ్చినట్లు చెప్పాల్సిందే... చెప్పకపోయావో టీటీడీలో సీనియర్ అర్చకుడివై చంద్రబాబు ద్వారా మానసిక క్షోభకు గురవుతావని బెదిరించాడు.

దానికి విక్రమార్కుడు, భేతాళ... ఈ ప్రశ్నకు ఒక్కటే సమాధానం చంద్రబాబు నాయుడు... అని చెప్పాడు. అదెలా అని భేతాళుడు అడిగాడు. అందుకు విక్రమార్కుడు... బీజేపీ వాళ్ళు ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడంలోనూ, వారి చేత క్యాంపులు నిర్వహించడంలోనూ నిష్ణాత గరిష్టుడైన చంద్రబాబును దూరం చేసుకున్నారు. 1985లో నాదెండ్ల వెన్నుపోటు సమయంలో ఎన్టీఆర్‌కు మద్దతుగా ఎమ్మెల్యేలను కూడగట్టిన అనుభవశాలి... 1995లో అదే ఎన్టీఆర్‌కు వ్యతిరేకంగా ఎమ్మెల్యేలను చీల్చిన ధీశాలి... 2014 నుండి వైసీపికి చెందిన 23మంది ఎమ్మెల్యేలను, ముగ్గురు ఎంపీలను గుట్టుచప్పుడు కాకుండా కొనుగోలు చేసిన అపర మేధావి... ఈ కష్టకాలంలో ఆయనే గనుక బీజేపీకి తోడుండుంటే 8మంది ఎమ్మెల్యేలేం ఖర్మ 80మంది ఎమ్మెల్యేలను ఈజీగా లాగేసుండేవాడు. యడ్యూరప్పకు సీఎం సీటును వదలాల్సిన పని వుండేది కాదు. చంద్రబాబును దూరం చేసుకోబట్టే కర్నాటకలో కుర్చీ కమలానికి దూరమైందని చెప్పాడు. ఈ సమాధానానికి సంతృప్తి చెందిన భేతాళుడు ఇంకో రెండు బీర్లు చేతిలో పట్టుకుని డిఆర్ హోటల్ పైనే వున్న సెల్‌టవర్ ఎక్కేసాడు.

# కల్యాణ వైభవం...!



చేజర్ల మండలం పుల్లనీళ్ళపల్లి గ్రామ వాస్తవ్యులు మాగంటి ప్రసాద్ - పద్మజల కుమార్తె
**యమున - మురళీకృష్ణ** (గద్వాల వాస్తవ్యులు కల్వకూరి బ్రహ్మయ్యనాయుడు - ప్రమీలల కుమారుడు)ల
వివాహం ఈ నెల 9వ తేదీ నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్ నందు వైభవంగా జరిగింది.
వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

## చెంగాళమ్మ బ్రహ్మోత్సవాలకు
# బ్రహ్మాండంగా ఏర్పాట్లు



ఐదేళ్ళకోసారి నిర్వహించే సూళ్ళూరుపేట గ్రామదేవత శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థానం బ్రహ్మోత్సవాలను ఈ నెల 31వ తేదీ నుండి జూన్ 6వ తేదీ వరకు నిర్వహించనున్నారు. మే31వ తేదీ బలిహరణ, జూన్ 1వ తేదీ సుళ్ళు ఉత్సవం, అశ్వవాహనం, 2వ తేదీ మహిషాసుర మర్ధిని, 3వ తేదీ సుళ్ళు ఉత్సవం, నంది సేవ, 4వ తేదీ తెప్పోత్సవం, 5వ తేదీ శయనసేవ, 6వ తేదీ పుష్ప పల్లకి సేవలు జరగనున్నాయి. ప్రతిరోజూ అమ్మవారి గ్రామోత్సవం జరుగుతుంది. బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ ఛైర్మెన్ ముప్పాళ్ళ వెంకటేశ్వరరెడ్డి, కార్య నిర్వహణాధికారి ఆళ్ళ శ్రీనివాసులురెడ్డి మరియు పాలకమండలి సభ్యుల ఆధ్వర్యంలో చకచక ఏర్పాట్లు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వినూత్నమైన ప్రచారరథాన్ని ఇటీవలే ఛైర్మెన్ వెంకటేశ్వరరెడ్డి ప్రారం భించారు. బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులకు ప్రత్యేకంగా హెలీటూర్‌ను ప్రారంభిస్తున్నారు. హెలికాప్టర్‌లో సూళ్ళూరుపేట చుట్టుపక్కల వున్న పర్యాటక కేంద్రాలను వీక్షించవచ్చు.

సూళ్ళూరుపేట చెంగాళమ్మ శక్తి స్వరూపణి. కష్టాలు తొలగించే కల్పవల్లిగా భక్తులు కొలుస్తారు. నెల్లూరు, చిత్తూరు జిల్లాతో పాటు తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుండి కూడా పెద్దసంఖ్యలో భక్తులు వస్తుంటారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని దేవస్థానం వద్ద తగు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అన్ని ప్రభుత్వశాఖలు కూడా బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో పాలుపంచుకుంటున్నాయి. పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు కూడా ఈ ఉత్సవాలకు హాజరుకానున్నట్లు తెలుస్తోంది.

# అన్నదానానికి మెట్టుకూరు విరాళం



ఏఎస్‌పేట మండలం పందిపాడులోని సీతారామస్వామి దేవస్థానంలో అన్నదానానికి గాను జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. తన కుటుంబసభ్యులు, పెద్దలైన బోయిళ్ళ పాపిరెడ్డి, కొండారెడ్డి, శ్రీమతి సుబ్బమ్మల జ్ఞాపకార్ధంగా ఆయన ఆలయ నిర్వాహకులకు ఈ విరాళం అందించారు.

# గౌడ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



విలేకర్లతో మాట్లాడుతున్న జానా రామచంద్రయ్యగౌడ్, అన్నం దయాకర్‌గౌడ్

కౌండిన్య హెల్త్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదవ తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు ట్రస్టు ఛైర్మెన్ జానా రామచంద్రయ్యగౌడ్, ప్రధానకార్యదర్శి అన్నం దయాకర్‌గౌడ్ తెలిపారు. ఈ నెల 21న విలేకర్లతో వారు మాట్లాడుతూ ఈ ఏడాది పదవతరగతిలో 8.5 గ్రేడ్ పాయింట్లు, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 900 మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. అర్హులైన విద్యార్థులు జూన్ 5వ తేదీలోగా మార్కులలిస్టు, ఆధార్‌కార్డు, కులధృవీకరణ, పాస్‌పోర్టు సైజ్ ఫోటోతో దరఖాస్తులను రావుల వెంకటేశ్వర్లుగౌడ్, ఇండస్ట్రీయల్ ఎస్టేట్, నెల్లూరు చిరునామాకు పంపాలన్నారు. ఇతర వివరాలకు 9848887400, 9297006377 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో రావుల వెంకటేశ్వర్లుగౌడ్, దద్దోలు రమణయ్య గౌడ్, తుల్లూరు మల్లిఖార్జునగౌడ్, రావుల కేశవులుగౌడ్, పి.ధనుంజయగౌడ్, ఉప్పాల వెంకయ్యగౌడ్‌లు పాల్గొన్నారు.

## నీరే ప్రాణాధారం..
# అందుకే 'అమృతధార'

### - ప్రముఖదాత, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



ప్రతి మనిషికీ నీరు అవసరమని, నీరే ప్రాణాధారమని అందుకే 'అమృతధార' కార్యక్రమం చేపట్టి, జిల్లాలో తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో శుద్ధనీటి జలాలను అందజేస్తున్నామని ప్రముఖ దాత, రాజ్యసభ సభ్యుడు, విపిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అన్నారు. ఈ నెల 23న ఉదయగిరి, కావలి, కోవూరు నియోజకవర్గాల్లో నీటిఎద్దడి, నీటి సమస్యలున్న 6 గ్రామాల్లో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'విపిఆర్ అమృతధార' కార్యక్రమంలో భాగంగా మినరల్ వాటర్‌ప్లాంట్‌లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజలకు మరింతగా సేవచేస్తానని, వెనుకబడిన గ్రామాల్లో త్రాగునీటి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు. తాము అందజేస్తున్న ఈ మినరల్‌వాటర్ ప్లాంట్‌లను ఆయా గ్రామాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయా గ్రామపంచాయతీలు, ప్రజల అభ్యర్ధన మేరకు ఈ మినరల్ వాటర్‌ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వమైన స్పందన లభిస్తోందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో జిల్లావ్యాప్తంగా మరిన్ని వాటర్‌ప్లాంట్‌లు నెలకొల్పడానికి పటిష్టమైన ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.

ఆ తర్వాత ఆయన యువతను ఉద్దేశించి మాట్లాడుతూ, యువతను ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో విపిఆర్ వికాస్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా క్రికెట్ కిట్‌లను అందజేసి గ్రామీణ క్రీడాకారుల్లో ఉన్న క్రీడా ప్రతిభను ప్రోత్సహిస్తున్నామన్నారు. వారు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిల్లో ప్రతిభ సాధించేవిధంగా సహకారం అందిస్తున్నామన్నారు. జిల్లాలోని ప్రజలందరూ విపిఆర్ ఫౌండేషన్ ద్వారా అమలయ్యే కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## విపిఆర్ సేవలు సమాజానికెంతో ఉపయోగం - నల్లపరెడ్డి ప్రసన్న



నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో కలిసి వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న విపిఆర్

తొలుత రామవరప్పాడు, అల్లూరు మండలంలోని అల్లూరు ఎస్‌సి వాడ, కొత్తపాళెం, దగదర్తి మండలంలోని ఉప్పలపాడు, కోవూరు నియోజకవర్గంలోని బుచ్చిరెడ్డిపాళెం మండలం పురందరపురం గ్రామాలలో 'విపిఆర్ అమృతధార' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయా ప్రాంతాల్లో సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు. పురందర పురం గ్రామంలో వైఎస్సార్సీపి నాయకుడు నల్లపరెడ్డి ప్రసన్న మాట్లాడుతూ, విపిఆర్ సమాజసేవాభావంతో చేస్తున్న కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. ఇప్పటికే జిల్లాలో విపిఆర్ విద్య, విపిఆర్ వైద్యం, విపిఆర్ వాత్సల్యం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, వాటితోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తాగునీరందించే బృహత్ కార్యక్రమమైన విపిఆర్ అమృతధార ప్రజలకు మరెంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. రామవరప్పాడులో ఆ గ్రామ సర్పంచ్ శ్రీమతి కొండమ్మ, అల్లూరు మండలంలో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొని విపిఆర్ అమృతధార విశిష్టతను అందరికీ తెలియజేశారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు కె.చంద్రలీలమ్మ, శ్రీమతి ఇందిరమ్మ, పి.జ్యోతి, శ్రీమతి ఎం.భార్గవిలతో పాటు గ్రామపెద్దలు, ఆయా ప్రాంతాల్లోని నాయకులు పాల్గొన్నారు. విపిఆర్ ఫౌండేషన్ తరపున సిఇఓ ప్రొ.వి.నారాయణరెడ్డి, వాటర్‌ప్లాంట్స్ ముఖ్యసమన్వయకర్త ఎన్.శంకర్, పౌరసంబంధాల ప్రతినిధి రాజేశ్వరరెడ్డి, సంస్థల గ్రూప్ సమన్వయకర్త విజయ్‌రెడ్డి, సింహపురి హాస్పిటల్స్ ఛైర్మెన్ కె.రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నలుబోలు, కొండూరుకు జీవితసాఫల్య పురస్కారాలు



నెల్లూరులోని కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీ నెల్లూరు టౌన్‌హాలులో ప్రపంచ తెలుగు సమాఖ్య జిల్లా రీజినల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్య నాయుడు, ఓం సాయి రెడ్డి వివాహ వేదిక అధినేత కొండూరు హరినారాయణరెడ్డిలకు జీవిత సాఫల్య పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు సభికులను అలరించాయి. పాటలపోటీలలో గెలుపొందిన విజేతలకు ముఖ్యఅతిథుల చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కొండా బలరామిరెడ్డి, వి.హజరత్‌బాబు, వాకాటి విజయ కుమార్‌రెడ్డి, బయ్యా శ్రీనివాసులు, దేవరాల సుబ్రహ్మణ్యం యాదవ్, ఎస్.వి.రమేష్‌బాబు, ఆచార్య ఆదిత్య పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణను ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు పర్యవేక్షించాడు.

# దేవుడితో దాగుడుమూతలు!

(మొదటి పేజీ తరువాయి)

టీటీడీ మెంబర్‌గా వుండి కూడా అన్యమత ప్రచారసభలకు వెళ్ళిన పుట్టా సుధాకర్‌యాదవ్‌ను టీటీడీ ఛైర్మెన్‌గా నియమించవద్దంటూ ఇటీవల రాష్ట్రంలో పలువురు స్వామీజీలు, పీఠాధిపతులు, హిందూ సంస్థల ప్రతినిధులు డిమాండ్ చేశారు. చంద్రబాబు అవేవీ పట్టించుకోకుండా పుట్టా సుధాకర్‌యాదవ్‌ను టీటీడీ ఛైర్మెన్‌ను చేసాడు.

## రమణదీక్షితుల విమర్శలు...

తాజాగా ప్రధానార్చకులు రమణదీక్షితులతో వివాదం. 65 ఏళ్ళు నిండితే అర్చకత్వానికి పనికిరారంటూ ఆయనను విధుల నుండి తప్పించారు. ఆయన ఊరుకుంటాడా? తిరుమల విషయంలో తెలుగుదేశం ప్రభుత్వం చేసిన నిర్వాకాలన్నింటిని బయటపెడుతున్నాడు. కేవలం బీజేపీ అగ్రనాయకులతో సంబంధాలున్నాయని చెప్పి రమణదీక్షితుల పదవిని ఊడబెరికినట్లయ్యింది. 65ఏళ్ళు నిండితే మేము దేవుడి సేవకు పనికిరామా? మరి 68ఏళ్ళున్న చంద్రబాబునాయుడు మాత్రం ప్రజాసేవకు పనికివస్తాడా? మా పిల్లలకు అర్చక వారసత్వం రాదా? మరి ఏ అర్హతలున్నాయని చెప్పి చంద్రబాబు తన కొడుకు లోకేష్‌ను మంత్రిని చేసుకున్నాడంటూ రాష్ట్ర వ్యాప్తంగా బ్రాహ్మణ పెద్దలు, అర్చకస్వాములు అడుగుతున్న ప్రశ్నలకు తెలుగుదేశం నాయకుల వద్ద సమాధానాలు లేకుండా పోయాయి. అదేమంటే రమణదీక్షితులకు వందలకోట్ల ఆస్తులున్నాయంటున్నారు. ఆదాయానికి మించి ఆస్తులుంటే మరి ఏసిబి ఏం చేస్తున్నట్లు?..

## శ్రీవారి వజ్రం మాయమైనట్లేనా..?

ఇక శ్రీవారి వజ్రం మాయం కావడంపై వివాదం వుంది. ఒకరేమో భక్తులు చల్లిన కానుకలు తగిలి ఈ వజ్రం పగిలి ముక్కలైందంటారు. టీటీడీ ఛైర్మెన్ పుట్టా సుధాకర్ యాదవ్ మాత్రం అసలు అలాంటి వజ్రమే లేదంటున్నాడు. రమణదీక్షితులు మాత్రం టీటీడీలో స్వామి వారి ఆభరణాలకు లెక్కలు లేవంటున్నాడు. ఈ వజ్రం వివాదం ఇప్పుడు బాగానే రగుల్కొంది. ఈ మధ్యంతా చంద్రబాబుకు చుక్కలు చూపిస్తున్న వైసిపి ఎంపి విజయసాయిరెడ్డి ఇంకో అడుగు ముందుకేసాడు. శ్రీవారి పోటులో తవ్వకాలు జరిపారని, ఆభరణాలను చంద్రబాబు ఇళ్ళకు తరలించారని సిబిఐ దాడులు చేస్తే దొరుకుతాయని బాంబు పేల్చాడు. మరోపక్క బీజేపీ ఎంపి సుబ్రహ్మణ్యస్వామి రమణ దీక్షితుల తరపున న్యాయపోరాటం చేస్తానంటున్నాడు.

మొత్తానికి చంద్రబాబు తిరుమలను ఒక రాజకీయ కేంద్రంగా, రాజకీయ చర్చకు ప్రధాన మార్గంగా చేసిపెట్టాడు. తిరుమల వివాదంతో బ్రాహ్మణ సమాజంలో వ్యతిరేకత తెచ్చుకున్నాడు. 2014 ఎన్నికలకు ముందు వైసిపి అధినేత జగన్ చెప్పులు విడిచి శ్రీవారి దర్శనానికి వెళ్ళినా చెప్పులతో లోపలకు వెళ్ళినట్లు చూపించి పచ్చమీడియా పెద్ద రచ్చ చేసింది. మరిప్పుడు కొండ మీద ఇంతపెద్ద రాజకీయ గోల జరుగుతోంది. శ్రీవారితో పెట్టుకుంటే ఏమవుతుందో త్వరలోనే తెలుస్తుంది.

# ఎయిర్ హెల్

(5వ పేజీ తరువాయి)

ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ డౌన్ అవుతుందో, ఎన్ని ఫోన్‌లు సిగ్నల్ పోతాయో, ఎన్నికాల్స్ డ్రాప్ అవుతాయో చెప్పలేని పరిస్థితి. దీనికితగ్గట్లు ఇంట్లో వుంటే ఫోన్ రాదు. బెడ్‌రూమ్‌లో వుంటే సిగ్నల్ అందదు. అరకొర సిగ్నల్ వుండి కాల్ వచ్చిందంటే అవతల వ్యక్తితో మాట్లాడడానికి అదరాబదరా మేడలెక్కాల్సిన పరిస్థితి. ఎయిర్‌టెల్ వాళ్ళు వినియోగ దారులను పెంచుకోవడంపై చూపిస్తున్న ఆసక్తి, నెట్‌వర్క్ కెపాసిటీ పెంచుకోవడంపై చూపించడం లేదు. ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ సెల్‌లో మాట్లాడాలంటే ప్రస్తుతం మిద్దెలపైకి ఎక్కాల్సి వస్తోంది. నెట్‌వర్క్ కెపాసిటీ పెంచకుండా వాళ్ళు వినియోగదారులను పెంచుకుంటుంటే... ఇకముందు ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌లో మాట్లాడాలంటే మిద్దెమీదకు కాకుండా ఎయిర్‌టెల్ టవర్‌ల వద్దకు పరుగులు తీయాల్సి వుంటుందేమో! ఇప్పటిదాకా బిఎస్ఎన్ఎల్‌కు చెత్త నెట్‌వర్క్ అని, సిగ్నల్స్ వుండవని పేరుండేది. ఇప్పుడు బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌ను మంచి అనిపించేంత చెత్తగా ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ తయారైంది.

పరిస్థితి ఇలాగే కొనసాగితే ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ పుణ్యమా అని మందుల కంపెనీ వాళ్ళు బి.పి మాత్రల ఉత్పత్తిని పెంచుకోవాల్సి వస్తుందేమో...?





# ఆగిన.. నవలా నాడి

యద్దనపూడి సులోచనారాణి.. అంటేనే మనకు 'సెక్రటరీ' సినిమా గుర్తుకొస్తుంది. మరో అత్యద్భుతమైన చిత్రం 'జీవన తరంగాలు' జ్ఞాపకానికి వస్తుంది. విచిత్రబంధం, కాంచనగంగ వంటి చిత్రాలు కూడా గుర్తుకొస్తాయి. ఎందుకంటే అవి మన మనసుల్లో అట్టే నిలిచిపోయాయి. అత్యద్భుతమైన కథాకథనంతో, కంటతడిపెట్టించే సెంటిమెంట్లతో నిండిపోయిన చిత్రాలవి. ఆ చిత్రాలకు మూలకథలు కూర్చిన నేర్పరి.. మరెవరో కాదు.. ఆమే యద్దనపూడి సులోచనారాణి. ఆమె రచించిన పలు నవలలు.. తెలుగుచిత్రాలకు కథలుగా మారి, ఆ చిత్రాలు ప్రజల గుండెల్లో నిలచిపోవడం ఎంతైనా విశేషం. మధ్యతరగతి కుటుంబాల్లోని జీవితాలనే ఆమె ఇతివృత్తాలుగా తీసుకునేవారు. బంధాలు, అనుబంధాలు, ప్రేమలు-అనురాగాలు, స్నేహాలు.. ఆత్మీయతలు ఇలాంటి అంశాల పట్లనే ఆమె ఎక్కువగా స్పందించే వారు. సమాజంలోని సంక్లిష్ట పరిస్థితులను అవగాహన చేసుకుని, బంధాలను అనుబంధాలను కరిగిపోకుండా కాపాడుకోవాలంటూ తనదంటూ ఒక ప్రత్యేకమైన శైలిలో.. అత్యద్భుతమైన నవలలను సృష్టించి తమ రచనలతో జనాన్ని, అశేష పాఠక జనాన్ని ఉర్రూతలూగించారామె. ఆమె రచించిన ప్రతి రచనా ఒక అద్భుతమే. దాదాపు మూడున్నర దశాబ్దాలపాటు ఆధునిక తెలుగు నవలా లోకాన్ని ఏకఛత్రాధిపత్యంగా ఏలిన ఆమె, తన 79వ ఏట కనుమూశారు. అమెరికాలో ఉన్న తన కుమార్తె లక్ష్మీశైలజ వద్దకు వెళ్ళివుండగా, గుండెపోటుతో నిద్రలోనే ఈ లోకం వీడి వెళ్ళిపోయారు.

## 15 ఏళ్ళ వయసులోనే తొలి కథ :

యద్దనపూడి సులోచనారాణి స్వస్థలం కృష్ణాజిల్లా మొవ్వ మండలంలోని కాజ అనే గ్రామం. 1940లో ఆమె జన్మించారు. తల్లిదండ్రులు నెమలికంటి మహాలక్ష్మి-వెంకట చలపతిరావు. ఎక్కడో మారుమూలన ఉన్న ఈ గ్రామం నవలారాణి జననంతో మరింత ప్రఖ్యాతమైంది. ఆమె తొలిరచన 15ఏళ్ళ వయసులోనే చేశారు. 'చిత్రనళీయం' అనే ఆ కథ 1956లో ప్రచురితమైంది. ఇక అప్పటినుంచి ఆమె ఎన్నెన్నో కథలు, నవలా రచనల్లో ఇక వెనక్కి చూడలేదు. కృష్ణాజిల్లాకు చెందిన యద్దన పూడి నరసింహా రావుతో ఆమెకు వివాహమైంది. వీరి ఏకైక కుమార్తె లక్ష్మీశైలజ ఇప్పుడు అమెరికాలోని గూగుల్ సంస్థలో పని చేస్తున్నారు. 2015లో యద్దనపూడి సులోచనారాణికి రాష్ట్ర ప్రభుత్వం కళారత్న(హంస) అవార్డును బహుకరించి సత్కరించింది. యద్దనపూడి సులోచనారాణి సోదరి గోవిందరాజు సీతాదేవి కూడా నవలా రచయిత్రే కావడం విశేషం.

## 70 దాకా నవలలు.. వాటిలో కొన్ని చలనచిత్రాలు:

సాధారణంగా ఒకటి రెండు నవలలు రాయాలంటేనే ఎంతో కష్టం. అందుకు ఎంతో ఓర్పు, నేర్పుతో పాటు రచనల పట్ల ఎనలేని ఆసక్తి ఉండాలి. యద్దనపూడి సులోచనారాణి ఏకంగా 70 దాకా నవలలు రాశారంటే ఎంతో అద్భుతమైన విషయం. ఆగమనం, ఆరాధన, ఆత్మీయులు, అమరహృదయం, అమృత ధార, అనురాగ గంగ, అనురాగ తోరణం, ఆశల శిఖరాలు, దాంపత్యవనం, హృదయగానం, జలపాతం, జీవనసత్యాలు, జీవన సౌరభం, జీవనతరంగాలు, జీవనగీతం, కలల కౌగిలి, మధురస్వప్నం, మీనా, ప్రేమదీపిక, ప్రేమలేఖలు, ప్రేమపీఠం, ప్రేమసింహాసనం, సహజీవనం, సెక్రటరీ, స్నేహమయి, సుకుమారి... ఇలా ఎన్నో నవలలు..అన్నీ అద్భుతాలే. ఆ నవలల పేర్లే హైలైట్‌గా ఉండేవి. నవలలకి తగ్గట్టుగా ఎంతో జాగ్రత్తగా ఎంపిక చేసుకున్న ఆ పేర్లంటే పాఠకులకెంతో ఇష్టం. అందుకే ఆ నవలలన్నీ సూపర్‌హిట్‌లయ్యాయి. అందులో కొన్ని సినిమాలుగా కూడా వచ్చాయి.

## అనుబంధాలు ఆత్మీయతలే.. కథావస్తువులు:

'చదువుకున్న అమ్మాయిలు' చిత్రంతో ఆమె సినీ కథా ప్రపంచంలోకి అడుగుపెట్టింది. 1965లో మనుషులు-మమతలు, ఆ తర్వాత 'మీనా' వెండితెరపై ఆవిష్కృతమయ్యాయి. సెక్రటరీ, జీవనతరంగాలు వంటి చిత్రాలు పెద్ద సంచలనాలు సృష్టించాయి. జైజవాన్, విజేత, అగ్నిపూలు, గిరిజా కల్యాణం, రాధా కృష్ణ, ఆత్మగౌరవం, బంగారు కలలు, ప్రేమలేఖలు, చండీప్రియ వంటి చిత్రాలకు ఆమె నవలలే మూలకథలు. అవి కూడా సూపర్‌హిట్లే. బుల్లితెరలోనూ ఆమె ప్రఖ్యాతి సాధించింది. ఆగమనం, అగ్నిపూలు, సుకుమారి, రుతురాగాలు, నీరాజనం, రుతుగీతం, రాధా మధు తదితర ధారావాహికలు ఆమె రచనల ఆధారంగా తెరకెక్కాయి.

ఆమె నవలలకు మధ్యతరగతి కుటుంబాల్లోని సజీవమైన బంధాలే ప్రేరణ. అందుకే అవి పాఠకుల హృదయాల్లోకి చొచ్చుకుపోయాయి. సమాజంలో మానవీయబంధాలు మాసిపోకూడదన్నదే ఆమె భావన. అదే ఆమె రచనలకు శాశ్వతత్వం సంపాదించిపెట్టింది. ఎక్కువగా యువతీ యువకులు ఆమె నవలలు బాగా చదివేవారు. వారి కలలకు, ఆశలు.. ఆకాంక్షలకు ఆ నవలలు దర్పణాలుగా ఉండేవి. అందుకే యద్దనపూడి సులోచనారాణి నవలలు పాఠకులకు ఒక పెద్ద క్రేజ్‌గా మారాయి. స్త్రీ పురుష సంబంధాలు ప్రేమమయంగా, ఆత్మీయంగా, స్వచ్ఛంగా ఉండాలని కోరుకునే ఆ నవలలు అందరికీ ప్రీతిపాత్రమయ్యాయి. నవలా రచనలో సుదీర్ఘ కాలం గడిపిన ఆమె ఇటీవల రాయదలుచుకున్న కథ 'ఔనా' పూర్తికాక ముందే ఆమె నిద్రలోనే గుండెపోటుతో ఈ నెల 21న అమెరికాలో శాశ్వతనిద్రలోకి వెళ్ళిపోయారు. అక్షర సుగంధాలు విరజిమ్మిన ఓ సాహితీసుమం నేలరాలి పోయింది. ఒక 'మధుర స్వప్నం' నిద్రలోనే జారిపోయింది. ఒక 'జీవనసౌరభం' వాడిపోయింది.. ఆమె హృదయం.. 'అమర హృదయ'మైంది!.. ఆ 'అనురాగ తోరణానికి'...ఆ మహా నవలామణికి 'లాయర్' కన్నీటి నివాళి అర్పిస్తోంది.

# ఫ్రంట్... మరో స్టంట్!

(మొదటి పేజీ తరువాయి)

తన ప్రమాణస్వీకారోత్సవ సభలో కర్నాటక ముఖ్యమంత్రి కుమారస్వామి చెప్పినట్లు బీజేపీ అశ్వమేధయాగం గుర్రాన్ని కర్నాటకలో కట్టేసారు. గత నాలుగేళ్ళుగా బీజేపీ అశ్వమేధ యాగ గుర్రం ఒక్కో రాష్ట్రాన్ని ఆక్రమించుకుంటూ వచ్చింది. కర్నాటకలో కూడా జెండా పాతబోయారు కాని కాంగ్రెస్-జెడి(ఎస్)లు తేరుకుని బీజేపీ జైత్రయాత్రకు అడ్డుకట్టవేయగలిగాయి.

కర్నాటక పరిణామాలు బీజేపీ వ్యతిరేక శక్తులకు ఎనలేనిఉత్సాహాన్ని తెచ్చాయి. గత నాలుగేళ్ళుగా బీజేపీ సాగిస్తున్న దండయాత్ర, జైత్రయాత్రలతో జాతీయ స్థాయి పార్టీలైన కాంగ్రెస్, వామపక్షాలే కాదు, బీఎస్పీ, ఎస్పీ, ఆర్‌జెడి, ఆర్ఎల్‌డి, జెఎంఎం, శివసేన, ఎన్‌సిపి వంటి పార్టీలు కూడా దారుణంగా దెబ్బతిన్నాయి. ఇక డిఎంకె, టిఎంసి, టీడీపీ వంటి పార్టీలు కూడా బీజేపీ నుండి తమకు ముప్పు పొంచివుందని భయపడుతున్నాయి. కాంగ్రెస్‌తో సహా ఇతర పార్టీలకున్న భయమే వారందరినీ ఏకతాటి పైకి వచ్చేలా చేసింది. కుమారస్వామి ప్రమాణస్వీకారోత్సవ సభను వారి ఐక్యతకు వేదికగా మలచింది.

ఈ సభకు యూపిఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీతో పాటు తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, ఎన్‌సిపి అధినేత శరద్‌పవార్, డిఎంకె నుండి కనిమొళి, సిపిఎం నుండి సీతారాం ఏచూరి, సిపిఐ నుండి సురవరం సుధాకర్‌రెడ్డి, బిఎస్పీ అధినేత్రి మాయావతి, ఆర్‌జెడి నాయకుడు తేజస్వియాదవ్, ఆర్ఎల్‌డి అధినేత అజిత్‌సింగ్, లోక్‌తాంత్రిక్ జనతా దళ్ అధినేత శరద్‌యాదవ్, సమాజ్‌వాదీ అధినేత అఖిలేష్‌యాదవ్, జేఎంఎం అధినేత హేమంత్ సోరెన్‌లు ఈ వేదికపై చేతులు కలిపారు. బీజేపీకి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో ఫ్రంట్ ఏర్పాటుకు ఇక్కడ ఓ అడుగుపడింది.

అయితే ఈ ఫ్రంట్ స్వరూపం ఎలా వుంటుందన్నది తెలియాల్సివుంది. కాంగ్రెస్ ఇప్పటికే యూపిఏలో వుంది. దాంతో కొన్ని ప్రాంతీయ పార్టీలున్నాయి. ఎన్డీఏ కూటమి పార్టీలు బీజేపీతోనే వుంటున్నాయి. రేపు ఏర్పడే ఫ్రంట్‌కు ఎవరు నాయకత్వం వహించాలి, ఎవరు మెడలో గంట కట్టుకోవాలన్న ప్రశ్న కూడా రావచ్చు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికే ఫెడరల్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేసి అన్ని ప్రాంతీయ పార్టీల అధినేతలనూ సంప్రదించి వున్నాడు. ఆయన నిన్నటి ప్రమాణస్వీకారోత్సవానికి రాకుండా అంతకు ముందురోజే బెంగుళూరొచ్చి కుమారస్వామిని అభినందించి వెళ్ళారు. ఎక్కడ తన అవినీతి అక్రమాలపై సిబిఐ చేత దాడులు చేయిస్తారోనని భయపడుతున్న చంద్రబాబు జాతీయ స్థాయిలో అన్ని పక్షాల మద్దతు కోసం తానే ఫ్రంట్ ఏర్పాటుకు నడుం కట్టొచ్చు. గతంలో యునైటెడ్ ఫ్రంట్ ఏర్పాటులో కీలకంగా పనిచేసిన అనుభవం ఆయనకుంది.

కాకపోతే ఈ ఫ్రంట్ బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్‌ను కలుపుకుని ఏర్పడుతుందా? లేక బీజేపీ, కాంగ్రెస్‌లకు వ్యతిరేకంగా ఏర్పడుతుందా? అన్నది చూడాలి. కాంగ్రెస్‌తో కలవకుండా ఏర్పడితే మళ్ళీ ఏ రాష్ట్రంలో అయినా యధాపరిస్థితే! బీజేపీ వ్యతిరేక ఓటును ప్రతి రాష్ట్రంలో కాంగ్రెస్, ఫ్రంట్ పార్టీలు చీల్చుకోవాల్సిందే! అప్పుడు తిరిగి లాభపడేది బీజేపీనే!

దేశ రాజకీయాలలో గతంలో పలుసార్లు సంకీర్ణ ప్రయోగాలు జరిగాయి. 1977లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఏర్పడ్డ జనతా కూటమి ఏడాదికే విచ్ఛిన్నమైంది. 1989లో ఏర్పడ్డ నేషనల్ ఫ్రంట్ ఆయుష్షు కూడా అర్ధాంతరంగానే ముగిసింది. 1996లో ఏర్పడ్డ యునైటెడ్ ఫ్రంట్ కూడా ఎక్కువకాలం నిలవలేదు. అసలు దేశ రాజకీయాలలో ఫ్రంట్ అనే పేరే కలిసి రాలేదు. ఏదైనా కాంగ్రెస్ సారధ్యంలోని యూపిఏ, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ సంకీర్ణాలే సుస్థిర ప్రభుత్వాలను అందించగలిగాయి.

ఒక లక్ష్యం, ఒక సిద్ధాంతం, ఒక జాతీయ వాదం లేకుండా కేవలం బీజేపీ పార్టీని అడ్డుకోవడమే లక్ష్యంగా ఏర్పడే ఇలాంటి స్వార్ధ రాజకీయ ఫ్రంట్‌లు టెంట్‌లు మాదిరిగా కూలిపోతాయి తప్పితే ఎక్కువకాలం నిలబడలేవు.




## జనం మన వెంటే...

# జయం మనవైపే..

### నెల్లూరు మహానాడులో టీడీపీ నేతల ఉద్ఘాటన

తెలుగుదేశం పార్టీ నెల్లూరుజిల్లా మహానాడు గురువారం 25వ తేదీ నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది. మహానాడు ప్రాంగణాన్ని పసుపుతోరణాలతో, బ్యానరల్‌తో, ఫ్లెక్సీ కటౌట్‌లతో అలంకరించారు. ఆయా నాయకులకు వారి అనుచరులు, అభిమానులు పోటీపడి ఫ్లెక్సీలు కట్టారు. ఇక సభలో పాల్గొని మాట్లాడిన నాయకులందరు కూడా చంద్రబాబు పాలన అద్భుతంగా ఉందని, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో అమెరికాను మించిపోయిందన్నట్లుగా కీర్తించారు. చంద్రబాబు పాలన పట్ల, ఆయన చేపట్టిన పథకాల పట్ల ప్రజలు ఆకర్షితులై ఆయనకు జేజేలు పలుకుతున్నారని, వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం తిరిగి తిరుగులేని విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేసారు. పనిలో పనిగా ప్రత్యేకహోదా ఇవ్వకుండా బీజేపీ మోసం చేసిందంటూ ఎత్తిపొడిచారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ మినీమహానాడులో మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.నారాయణ, ఎమ్మెల్యేలు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, బొల్లినేని రామారావు, పాశం సునీల్, మాజీమంత్రులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, పరసారత్నం, టి.రమేష్‌రెడ్డి, నాయకులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బీద మస్తాన్‌రావు, కిలారి వెంకటస్వామినాయుడు, కంభం విజయరామిరెడ్డి, చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి, ఆనం జయకుమార్‌రెడ్డి, కొండ్రెడ్డి రంగారెడ్డి, ముప్పాళ్ళ విజేత, టి.అనూరాధ, డాక్టర్ జడ్.శివప్రసాద్, తిరుమలనాయుడు, బి.జోత్స్నలత, వివిధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## జూన్ 4న నెల్లూరులో...

# గానగంధర్వుడి జన్మదినం



## పాటల కోకిలమ్మ ఆశీర్వచనం

**నెల్లూరు గానాలపట్టి, భారతీయ సినిమా గర్వించదగ్గ గాయకుడు యస్.పి.బాల సుబ్రహ్మణ్యం పుట్టినరోజు సంబరం జూన్ 4న నెల్లూరు టౌన్‌హాల్ ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం నందు జరుగనుంది.**



తన జన్మదినం సందర్భంగా ఆయన ప్రతియేటా ఇస్తున్న "యస్.పి.బాలసుబ్రహ్మణ్యం జాతీయ పురస్కారం" మరియు లక్ష రూపాయల నగదు బహుమానం ఈ ఏడాది పాటల కోకిలమ్మ యస్.జానకికి ఇవ్వాలని నిర్ణయించి ఆమెను సంప్రదించినప్పుడు ఆమె అత్యంత సున్నితంగా తిరస్కరించారు. సన్మానాలు, సత్కారాలు, పురస్కారాలకు తాను చాలా దూరంగా వుంటున్నానని, బాలు గారిపైనున్న అవ్యాజమైన ప్రేమాభిమానాలకు గుర్తుగా నెల్లూరుకు వచ్చి ఆ వేదికపై నుండి ఆత్మీయ ఆశీర్వచనం అందిస్తానని చెప్పారు. తనకివ్వదలచిన పురస్కారాన్ని ఏదైనా సమాజసేవా కార్యక్రమానికి వినియోగించమని ఆమె బాలు గారిని ఆదేశించారు. ఈ సందర్భంగా యస్.పి.బాలసుబ్రహ్మణ్యం ఆమెను గౌరవించుకుంటారు, ఆమె ఆశీస్సులు అందుకుంటారు.

ఈ సందర్భాన్ని పురస్కరించుకుని యస్.పి.బాలు మాట్లాడుతూ 1960-63ప్రాంతాల్లో తాను గూడూరు కాళిదాస కళానికేతన్ నిర్వహించిన పోటీల్లో పాటలు పాడానని, ఆ పాటల పోటీలకు న్యాయనిర్ణేతగా విచ్చేసిన ప్రముఖ సినీగాయని ఎస్.జానకి మాట్లాడుతూ, తనను దగ్గరకు పిలిచి బాగా ప్రయత్నిస్తే మంచి గాయకుడివవుతావని ఆశీర్వదించిందని తెలియజేశారు. మాతృ సమానురాలైన జానకమ్మ ఆశీర్వచనఫలంతో తాను విఖ్యాత గాయకునిగా ఇంత ఉన్నతస్థాయికి ఎదిగానన్నారు. ఇదంతా ఆ చల్లనితల్లి దీవెన లేనని అన్నారు. దాదాపు 50 సంవత్సరాలకు పైగా సినీపరిశ్రమలో పాటలు పాడుతూ మంచి పేరుప్రతిష్టలు సంపాదించుకున్నానని చెప్పారు. జానకమ్మ ఆత్మీయ ఆశీర్వచనాన్ని స్వీకరించేందుకే ఈ వేడుక నిర్వహిస్తున్నామన్నారు. 'నా పాటను అభిమానించి నన్ను గాయకునిగా అత్యున్నతస్థాయికి చేర్చడమే గొప్ప ఆశీస్సు'.. అని బాలూ ఈ సందర్భంగా జానకమ్మకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా ప్రముఖ కళా విమర్శకులు విఏకె రంగారావు, సినీసంగీత దర్శకుడు విద్యాసాగర్, సినీకవి భువనచంద్ర, జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ, వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్, లాయర్ వారపత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి, మురళీకృష్ణ గ్రూప్ ఆఫ్ హోటల్స్ ఎం.డి వీరిశెట్టి హజరత్‌బాబు తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్.జానకి జీవిత చరిత్రపై లఘుచిత్రం ప్రదర్శన ఉంటుందని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ & టెక్నాలజీ ఆధ్వర్యంలో నడిచే నూజివీడు ట్రిబుల్ ఐ.టిలో యోగా విభాగం నిర్వాహకులు సత్యశ్రీధర్ ఆధ్వర్యంలో 27 మంది విద్యార్థులచే సంగీతంతో కలిపిన యోగా నృత్యరూపకాలను ప్రదర్శిస్తారన్నారు.


# శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థానము

సూళ్ళూరుపేట, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా. ఫోన్: 08623-242076.

**బ్రహ్మోత్సవ ఆహ్వానము** తేది. 31.05.2018 నుండి 06.06.2018 వరకు

తేది. 31.05.2018
బలిహరణ

తేది. 01.06.2018
సుళ్ళు ఉత్సవం,
అశ్వవాహనం, గ్రామోత్సవము

తేది. 02.06.2018
మహిషాసురమర్ధని
గ్రామోత్సవము

తేది. 03.06.2018
సుళ్ళు ఉత్సవం
నంది సేవ, గ్రామోత్సవము



తేది. 04.06.2018
తెప్పోత్సవము
గ్రామోత్సవము

తేది. 05.06.2018
శయన సేవ, గ్రామోత్సవము

తేది. 06.06.2018
పుష్పపల్లకీ సేవ

ప్రతిరోజు సాయంత్రం
సాంస్కృతిక కార్యక్రమములు
జరుగును.

కావున భక్తులెల్లరు విచ్చేసి అత్యంత వైభవంగా జరుగు శ్రీ అమ్మవారి బ్రహ్మోత్సవములు తిలకించి, శ్రీ అమ్మవారిని దర్శించి తీర్ధప్రసాదములు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావలసినదిగా కోరుచున్నాము.

ముప్పాళ్ల వెంకటేశ్వర్లురెడ్డి
చైర్మెన్

ఆళ్ళ శ్రీనివాసరెడ్డి
కార్యనిర్వహణాధికారి

వాకాటి నారాయణరెడ్డి
ఎం.ఎల్.సి., నెల్లూరు

కిలివేటి సంజీవయ్య
ఎమ్మెల్యే, సూళ్ళూరుపేట

ధర్మకర్తల మండలి:

చిలకా యుగంధర్ | శ్రీమతి పిట్ల సుహాసిని | చిట్టేటి పెరుమాళ్ళు
అలవల సూరిబాబు | కీసరపల్లి నరేంద్ర(ఎక్స్ అఫిషియో) | వేనాటి గోపాల్‌రెడ్డి
ఆకుతోట రమేష్ | శ్రీమతి ముప్పాళ్ల విజయలక్ష్మి | పులుగు శ్రీనివాసులురెడ్డి


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com